ప్రజాశక్తి

ఆదివారం 22 జనవరి 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

రైతు ఉద్యమంపై కేంద్రం ఇచ్చిన హామీలను విస్మరించినందుకు నిరసనగా

26న ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయండి

రౌండ్‌టేబుల్‌లో ఎపి రైతుసంఘాల సమన్వయ సమితి నేతల పిలుపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మాట తప్పినందుకు నిరసనగా ఎపి రైతుసంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఈనెల 26 రిపబ్లిక్ డే రోజున నిర్వహించే ట్రాక్టర్ల ర్యాలీలో రైతులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు, రాష్ట్ర నాయకులు టి.ప్రసాద్ పిలుపు నిచ్చారు. ఎపి రైతుసంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం మచిలీపట్నంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వై.కేశవరావు మాట్లాడుతూ రైతులకు నష్టం చేసే నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఢిల్లీలో చేసిన దీక్షలకు దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం అప్పటి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ ద్వారా 2021 డిసెంబర్ 9న సంయుక్త కిసాన్‌కు ప్రభుత్వం తరపున అనేక అంశాలపై హామీలు ఇచ్చి, ఉద్యమాన్ని ఉపసంహరించాలని కోరారని, ప్రభుత్వం కోరిక మేరకు అప్పట్లో ఉద్యమాన్ని ఉపసంహరించారని గుర్తుచేశారు. కానీ ఏడాది దాటినా ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్లో ఉన్న హామీలను పరిష్కరించడానికి తక్షణం నిర్దిష్ట చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేస్తూ 26న ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరపై నియమించిన కమిటీ, దాని ఎజెండా రైతుల డిమాండ్లకు విరుద్ధంగా ఉన్నాయని, అందువల్ల ఈ కమిటీని రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్ని పంటలకు కనీస మద్దతు ధరను గ్యారంటీ చేస్తూ కొత్త కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కమిటీలో సంయుక్త కిసాన్ మోర్చాతో సహా రైతాంగానికి తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోవడం, రైతుల పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో 80 శాతం మంది రైతులు తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకుపోయి,

(మిగతా 6లో)

పెరిగిన బందరు పోర్టు వ్యయం

ధర నిర్ణయంపై భూ యజమానులతో అధికారుల చర్చలు • జాప్యమే కారణం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రభుత్వాలు జాప్యం చేయడంతో వాటి నిర్మాణ వ్యయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతోంది. మచిలీపట్నం పోర్టు నిర్మాణ భూ సేకరణ ప్రక్రియలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పోర్టు భూ సేకరణ ప్రక్రియను వైసిపి ప్రభుత్వం మూడున్నరేళ్లపాటు పూర్తిగా నిలిపివేసింది. తాజాగా పోర్టు నిర్మాణ పనులు ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్న నేపథ్యంలో రైలు, రోడ్డు కనెక్టవిటీకి అవసరమైన 146 ఎకరాల భూ సేకరణకు జిల్లా అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రయివేటు భూములకు ధర నిర్ణయించేందుకు సంబందిత అధికారులు భూములు కోల్పోయే రైతులతో చర్చిస్తున్నారు. 2019-20తో పోల్చితే కొన్ని గ్రామాల్లో 30 శాతం వరకు, మరికొన్ని గ్రామాల్లో 100శాతం భూములు విలువ పెంచాలని భూ యజమానులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రైల్ రోడ్డు కనెక్టవటీ భూ సేకరణకు రూ. 54.10 కోట్లు

రైలు, రోడ్డు కనెక్టవిటీకి మొత్తం 146 ఎకరాలు అవసరంగా గుర్తించారు. ప్రభుత్వ భూములు, గతంలో సేకరించిన భూములుపోను తాజాగా 48.48 ఎకరాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో చిలకలపూడి, పోతేపల్లి గ్రామాల్లో ఎకరం రూ. 40 లక్షలకు కొంత మేర భూములు కొనుగోలు చేయగా, తాజాగా ఈ గ్రామాల్లో సేకరించాల్సిన భూములకు రూ.80 లక్షలు డిమాండ్ చేస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లో 29.57 ఎకరాలు సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ గ్రామాల్లో భూ సేకరణకు రూ.23 కోట్ల 65 లక్షల 60 వేలు వ్యయం చేయాల్సి ఉంటుంది. కరగ్రహారంలో ఎకరం రూ.25 లక్షలకు గతంలో కొందరు యజమానుల నుంచి భూములను ముడా కొనుగోలు చేసింది. తాజాగా మరో 18.91 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఎకరం రూ. 31.50 లక్షలుకు భూములు ఇవ్వడానికి భూ యజమానులు అంగీకరించినట్లు సమాచారం. ఈ గ్రామంలో భూ సేకరణకు రూ.5,95, 66, 500 వ్యయం కానుంది. పోతేపల్లి, మాచవరం గ్రామాల్లో మరో 30.61 ఎకరాలకు సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. ఎకరం రూ.80 లక్షల చొప్పున ఈ గ్రామాల్లో భూ సేకరణకు రూ.24 కోట్లా 48 లక్షల, 80 వేలు అవసరం. మొత్తం భూ సేకరణకే రూ.54.10 కోట్లు వ్యయం చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ముఖ్యమంత్రి హోదాలో శంకుస్థాపన చేసిన చంద్రబాబు (పాతఫొటో)

నోటిఫికేషన్ ఇచ్చిన గ్రామాల వివరాలు

గ్రామం	విస్తీర్ణం (ఎకరాల్లో)
చిలకలపూడి	19.69
పోతేపల్లి	09.88
కరగ్రహారం	18.91
మొత్తం విస్తీర్ణం	48.48

మానవతావాది గుళ్లపల్లి బాబూరావు

నివాళులర్పిస్తున్న డి.వి.కృష్ణ, స్వరూపరాణి, విజయ తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ : వామపక్ష అభిమాని, అభ్యుదయవాది, నాగేంద్ర ప్రింటింగ్ ప్రెస్ అధినేత గుళ్లపల్లి బాబూరావు కార్మికుల పట్ల ఎంతో ఆప్యాయతగా ఉండేవారు. శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచిన ఆయన వామపక్షాలకు ఎంతో అండగా నిలిచారు. తన ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్న కార్మికులతో యజమానిగా కాకుండా కుటుంబ సభ్యుడిగా ఎంతో సహాయ సహకారాలతో అందించారు. తన ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్న ఓ కార్మికుడి చేతి వేళ్ల కట్టయిన సందర్భంలో ఎంతో బాధకు లోనై తన సొంత ఖర్చుతోనే ఆ కార్మికుడికి ప్లాస్టిక్ సర్జరీ చేయించారు. కరోనా కష్టకాలంలో తన కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవడంతోపాటు కార్మికుల కుటుంబాలు పస్తులుండకూడదని ప్రతి నెల పూర్తి స్థాయిలో వేతనాలు ఇచ్చి ఆదుకున్నారు. తమపై ఆయన చూపిన ప్రేమకు చిహ్నంగా పూలతో అలంకరించిన వాహనంపై గుళ్లపల్లి బాబూరావు భౌతికకాయాన్ని ఉంచి పెద్దఎత్తున ఊరేగింపుగా స్వయగా కార్మికులే అంతిమయాత్రగా కృష్ణలంక స్వర్గపురికి తీసుకెళ్లారు. శనివారం మధ్యాహ్నం ఆయన అంత్యక్రియలు స్వర్గపురిలో జరిగాయి.

పలువురు నేతల ఘన నివాళి

గుళ్లపల్లి బాబూరావు భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళు లర్పించారు. ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి మౌనం పాటించి సంతాపం తెలిపారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, విజయవాడ సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, జిల్లా సీనియర్ నాయకులు సిహెచ్ హనుమంతరావు తదితరులు ఆయన భౌతికయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

(ప్రధాన వార్త మెయిన్ పేజీలో)

సిపిఎం మాజీ వార్డు సభ్యులు, ఐద్వా నేత షేక్ గాలీబి మృతి

సిపిఎం, ఐద్వా నేతల నివాళి

పెనమలూరు : పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామపంచాయతీ 1వ వార్డు మాజీ సభ్యురాలు, సిపిఎం మహిళా శాఖ కార్యదర్శి, ఐద్వా నాయకురాలు షేక్ గాలీబి (53) శనివారం ఆకస్మికంగా మరణించారు. ఆమె గత కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో

చికిత్స పొందుతున్నారు. శుక్రవారం రాత్రి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆమెను చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతుండగా, ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మరణించారు. ఆమెకు భర్త షేక్ నాగూర్, కుమారులు సలీమ్, ఖాసీంవలి, కుమార్తె ఫాతిమా ఉన్నారు. గాలీబి యనమలకుదురు గ్రామపంచాయతీ సభ్యురాలిగా పలు అభివద్ధి పనులకు కృషి చేశారు. సిపిఎం శాఖా కార్యదర్శిగా, మహిళా సంఘం నాయకురాలిగా గ్రామంలోని మహిళలు, పేదలకు సంబంధించిన పలు సమస్యలపై ఉద్యమాలు చేశారు. ఆమె అంత్యక్రియలు ఆదివారం

(మిగతా 6లో)

పన్నుల పెంపుదలకు నిరసనగా

లారీ యజమానుల ర్యాలీ

ప్రజాశక్తి - గుడివాడ : రాష్ట్ర ప్రభుత్వం లారీ ఓనర్లపై విపరీతంగా పన్నులు పెంచడం వల్ల లారీలను నడపలేని పరిస్థితిలో ఉన్నామని పట్టణ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శిలు గుత్తా శివరామకృష్ణ (చంటి), ఆర్.బి.ఆర్ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెంచిన పన్నులు తగ్గించాలని డిమాండ్ చేశారు. పెంచిన పన్నులు, డిజీల్ ధరలు తగ్గించాలని కోరుతూ శనివారం పట్టణంలో ది లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ గతకొంత కాలంగా లారీల పరిస్థితి పూర్తిగా దెబ్బతిందన్నారు. మన రాష్ట్రంలో రోడ్లు పూర్తిగా ధ్వంసమైనా పట్టించుకునే నాధుడే లేదన్నారు. ప్రభుత్వం గతంలో రూ.200 ఉండే గ్రీన్ ట్యాక్స్‌ను నేడు రూ.1350లు చేయాలని చూడడం దారుణమన్నారు. ఇతర రాష్ట్రాల్లో తక్కువగా ఆయిల్ ధరలు ఉన్నాయన్నారు. మన రాష్ట్రంలో విపరీతంగా పెరిగిపోయాన్నరు. క్వాటర్, 2క్వాటర్ ట్యాక్స్‌లను ఇష్టానుసారంగా పెంచడం వల్ల లారీలు నడపలేని పరిస్థితి వచ్చిందన్నారు. తొలుత లారీ ఓనర్లు, డ్రైవర్లు, సిబ్బంది లారీ స్టాండు నుండి నెహ్రుచౌక్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రవాణశాఖ కార్యాలయం వద్దకు నిరసనగా వెళ్లి ఆర్‌టిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అడుసుమిల్లి శ్రీనివాసరావు, గోళ్ల శివా, మెరుగుమాల రామకృష్ణ, కాల్యాణ్, ఇరఫాన్, ఓనర్లు, డైవర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

మహిళా శిశు సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-ఎ.కొండూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మహిళా శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత నిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎ. సిరి అన్నారు. శనివారం మండలంలోని పెద్దతండ లో గల అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణీలు ,బాలింతలతో మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టిక ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించాఉ. ప్రతిరోజు పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి తీసుకొచ్చి పౌష్టిక ఆహారాన్ని అందించాలని సూచించారు అలానే అంగన్వాడీ కేంద్రంలో ఫ్రీ స్కూల్ ప్రాథమిక విద్యా విధానాన్ని పరిశీలించారు ముఖ్యమంత్రి వైయస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా అందించే పౌష్టిక ఆహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఆమె అన్నారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేసిన ఆమె సంతప్తిని

వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి ఉమాదేవి, ఐసిడిఎస్ తిరువూరు సిడిపిఓ జి సత్యవతి, సూపర్వైజరు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : ఉదయభాను

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించడానికి ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు కృషి చేయాలని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. పట్టణంలోని చిల్లకల్లు రోడ్డులో గల శుభమస్తు కళ్యాణ మండపంలో నియోజకవర్గ వైయస్సార్ సిపి ముఖ్య నేతలతో, నూతనంగా నియమించిన సచివాలయ కన్వీనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సామినేని ఉదయభాను, వారి తనయులు నియోజకవర్గ వైసిపి యువజన నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబు, నియోజకవర్గ పరిశీలకులు నూతలపాటి హనుమయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాల గురించి గ్రామస్థాయిలో ప్రజలకు, నాయకులు, ప్రజాప్రతినిధులు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ముత్తినేని విజయ శేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు

ప్రజాశక్తి-వత్సవాయి : వత్సవాయి నుండి వేమవరం రోడ్డుకి 30 లక్షల రూపాయ నిధులు మంజూరైనట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట వైఎస్ఆర్ విగ్రహం నుండి చిల్లకల్లు వరకు విస్తరణ లో భాగంగా వరకు రూ.14 కోట్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు., నియోజకవర్గంలో రోడ్ల అభివద్ధికి,మరమ్మతులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ కోర్ట్ ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నెకంటి జీవరత్నం ఆధ్వర్యంలో నందిగామలోని ఐకాన్ కేర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరమును అదనపు జిల్లా జడ్జి వి శ్రీనివాసరావు , పిడిఎం జడ్జి సి రమణారెడ్డి లు ప్రారంభించారు. ఐకాన్ కంటి ఆసుపత్రి డాక్టర్ మన్నెం నవ్య, డాక్టర్ కష్ణ చైతన్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు యర్రంరెడ్డి బాబురావు, కే సత్యనారాయణ, మన్నెం నారాయణరావు, బొందలపాటి రామకష్ణ, ఏపీపీ రంగారావు, సబ్ కోర్టు ఏపీపీ, ఎన్ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఆలిండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్ష, ప్రదాన కార్యదర్శిలుగా మౌలానా అబ్దుల్ ఖధీర్, షేక్ మునీర్ అహ్మద్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి షేక్ మునీర్ అహ్మద్ లబ్బీపేటలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14, 15 తేదీలలో చెన్నయ్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఆలిండియా మిల్లీ కౌన్సిల్ 22వ వార్షిక జాతీయ సర్వ సభ్యుల సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారన్నారు.

రక్షిత మంచినీటి పథకాల మంజూరు

ప్రజాశక్తి - విజయవాడ రూరల్

జలజీవన్ మిషన్ కింద ఎనికేపాడులో రూ.60 లక్షల తో రెండు రక్షిత మంచినీటి పథకాలు మంజూరైనట్లు సర్పంచ్ రాచమళ్ళ పూర్ణచంద్రరావు తెలిపారు. వాటి నిర్మాణలకు స్థలం కేటాయిస్తూ సాధారణ సమావేశం తీర్మానం చేసినట్లు చెప్పారు. శనివారం సర్పంచ్ రాచమళ్ళ పూర్ణచంద్ర రావు అధ్యక్షతన సమావేశం జరిగింది.రూ.5 లక్షల తో పంచాయతీ లైబ్రరీ రిపేర్, అదనపు గది నిర్మాణం చేయాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో పంచాయితీ కార్యదర్శి ప్రసాద్, ఉపసర్పంచ్ టాంకశాల శివశంకర్, ఎంపిటీసిలు మాదు సుబ్బారావు, గంగుల శ్రీనివాసరావు, రత్నకుమారి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-నందిగామ : ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని టిడిపి ఆధ్వర్యంలో శనివారం నందిగామ ఆర్డిఓ కార్యాలయం వద్ద రైతులు ధర్నా చేశారు.నందిగామ, జగ్గయ్యపేట మాజీ ఎంఎల్ఎలు తంగిరాల సౌమ్య,శ్రీ రాం రాజగోపాల్ పాల్గొని నందిగామ ఆర్డిఓ రవీంధ్ర రావు కు వినతి పత్రం అందజేశారు. మాజీ ఎంఎల్ఎలు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు లో వైసిపి నాయకులు జోక్యం లేకుండా చూడాలన్నారు. గోనె సంచులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కు తరుగు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నందిగామ మండల అధ్యక్షులు వీరంకి వీరాస్వామి, తెలుగు యువత నందిగామ మండల అధ్యక్షులు తోట



వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

నాగమల్లేశ్వరరావు, మనబోతుల శ్రీరామ, కొంగర నరేంద్ర, రాము, లక్ష్మీ నారాయణ, వేల్పుల బిక్షాలు,బొందలపాటి రామకష్ణ పాల్గొన్నారు.

ఉపకరణాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-మైలవరం : వికలాంగులకు ప్రభుత్వం అందించే ఉపకారణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని సివి. రేణుక, ఐ.ఈ.డి జిల్లా కోఆర్డినేటర్ ఎల్. వెంకటేశ్వరరావులు అన్నారు. డాక్టర్ లకిరెడ్డి హనీమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉచిత సహాయ ఉపకారణాల కొరకు వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగవైకల్యం కలవారికి ప్రభుత్వం అన్ని రకాలుగా తోడుంటుంది అన్నారు. ఎంఈఓ రత్న శ్యాంబాబు, సమగ్ర శిక్ష సీఎంఓ.రాంబాబు, ఏఎస్ఓ.అశోక్ పాల్గొన్నారు.

వైసిపి పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం : టిడిపి

ప్రజాశక్తి -తిరువూరు : ముఖ్యమంత్రి జగన్ చేతగానితనానికి రాష్ట్ర అభివద్ధి 100 ఏళ్ళు వెనక్కి వెళ్లిందని టిడిపి తిరువూరు నియోజకవర్గ ఇన్ ఛార్జ్ శావల దేవదత్తు అన్నారు. తిరువూరులోని టిడిపి కార్యాలయంలో శనివారం దేవదత్తు విలేకర్ల సమావేశంలో మాట్లాడు తూ అసలు చంద్రబా బును విమర్శించే అర్హత కూడా లేని ఎమ్మెల్యే రక్షణనిధి ఈనాలుగు ఏళ్ళ పాలనలో తిరువూరు నియోజకవర్గంలో చేసిన అభివద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవస్థలన్నీటిని నిర్వీ ర్యం చేసుకుంటూ పోతున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనింపే రోజుల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. టిడిపి నాయకులు గద్దె వెంక టేశ్వరరావు, బొమ్మసాని మహేష్, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవాలు

రెడ్డిగూడెంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కొండపల్లి మున్సిపాలిటీలోని నాగార్జున జూనియర్ కళాశాలలో బేఠి బచ్చావో బేఠి పడావో అనే అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ కె పుష్పలత మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు అన్ని రంగాలలో ముందు ఉండాలన్నారు. కలెక్టర్ ఆఫీసు కో ఆర్డినేటర్ నీలం శాంతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సి రమాదేవి, ఎమ్ఎస్‌కె పి రమాదేవి పాల్గొన్నారు. మూలపాడుఉన్నత పాఠశాల నందు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్ కెఎన్‌జె లక్ష్మీ పిటి వహీదా బేగం అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండల పరిధిలోని రంగాపురం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో జాతీయ బాలిక దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు., చైల్డ్ లైన్ 1098 సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాలికల సంరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలను అరికట్టాలని, బాలిక విద్యను ప్రోత్సహించాలని, బాలికలపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని చైల్డ్ లైన్ 1098 సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ శ్యామల, సంస్థ నిర్వాహకులు రమేష్ నాయకులు సెక్రటరీ ప్రకాష్ కుమార్ నాగరాజు మొదలైన వారు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని బండిపాలెం గ్రామంలో శనివారం హౌసింగ్ డే సందర్భంగా నిర్మాణంలో గల జగనన్న కాలనీ ఇండ్లను మండల అభివృద్ధి అధికారి జయచంద్ర ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల అభివద్ధి అధికారి టి. జయచంద్ర మాట్లాడుతూ గ్రామంలో లేఔట్‌లో గల 14 మంది లబ్ధిదారులు గహాలను నిర్మించుకుంటున్నారని, కాలనీలో మంచినీటి సౌకర్యం కొరకు పైప్ లైన్ కావాలని కోరారని, త్వరలో పైప్ లైన్ నిర్మాణం చేపడతామని తెలిపారు.

'జలకళ'తో ఉచితంగా బోర్లు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-నందిగామ : మండలంలోని పల్లగిరి గ్రామంలో వ్యవసాయ రైతు మానుకొండ కృష్ణారెడ్డి పొలంలో జలకళ పథకం ద్వారా బోరు వెల్ ఏర్పాటు పనులను శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మొండితోక జగన్మోహనరావు మాట్లాడుతూ అన్నదాత సంక్షేమానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మరో ముందడుగు వేసి జలకళ పథకాన్ని ప్రవేశపెట్టి రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తున్నారని తెలిపారు.. రెండున్నర ఎకరాల నుంచి 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు పథకం వర్తిస్తుందని తెలిపారు. పథకానికి సరిపడా వ్యవసాయ భూమి లేకుంటే చుట్టుపక్కల రైతులతో కలిసి దరఖాస్తు చేసుకునే ఉచితంగా బోరు వేసుకునే సదుపాయం కూడా కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ మహమ్మద్ మస్తాన్, గ్రామ సర్పంచ్ రవికిరణ్ రెడ్డి, జడ్పిటిసి గాదెల బాబు పాల్గొన్నారు .

26న 'లిటిల్ బ్రైన్స్' స్కూల్‌లో అక్షరాభ్యాసం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ : నగరంలోని సిద్దార్థ నగర్‌లోని లిటిల్ బ్రైన్స్ స్కూల్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరం పాఠశాలలో చేరబోయే చిన్నారులకు వసంత పంచమి రోజున 26వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు తమ పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ముందుగా అక్షరాభ్యాసం కొరకు తమ పిల్లల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 7075495975 ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

కొనసాగుతున్న నిరాహారదీక్షలు

ప్రజాశక్తి-వీరులపాడు: మండల మార్పు వ్యతిరేకంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారంతో 37వ రోజుకు చేరాయి.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వట్టి కొండ చంద్రమోహన్, అద్దంకి మార్తమ్మ, పల్లె పోగు సుజాత, అద్దంకి ప్రభావతి, కోవూరు మార్తమ్మ, చింతపల్లి సుజాత, అద్దంకి కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ వహించండి

ప్రజాశక్తి -తిరువూరు : తిరువూరు నగర పంచాయితీ పరిధిలోని అన్ని వార్డులలో పారిశుధ్య నిర్వ హణపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీ సుకోవాలని శానిటేషన్ కార్యదర్శులను కమిషనర్ డి.బాలక్రిష్ణ ఆదేశించా రు. స్థానిక తన కార్యాలయంలో కమిషనర్ శనివారం వార్డు సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సిసి డ్రైయినేజీలలో, మురుగు కాలువల్లో పూడికతీత పనులు, మురుగునీరు పారుదల చర్యలు, దోమల వ్యాప్తి నిర్మూలన వంటి వివిధ చర్యలపై ప్రత్యేక దష్టి సారించి ప్రజలకు ఆరో గ్యకరమైన వాతావరణం కల్పించాల ని ఆయన తెలిపారు.

రక్తహీనత నివారణకు కృషిచేయాలి

చల్లపల్లి : రక్తహీనత నివారణకు ప్రతి ఒక్కరి కృషి చేయాలని ప్రజల్లో తల్లిదండ్రులలో అవగాహన పెంపొందించాలని చల్లపల్లి మండల ప్రత్యేక అధికారి గంజి శ్రీనివాసరావు సూచించారు. చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 'సుస్థిర అభివృద్ధి-లక్ష్యసాధనలో భాగంగా గ్రామ సచివాలయ గ్రేడ్ 5 కార్యదర్శులు, ఏఎన్ఎం మహిళా పోలీసులు, వెల్ఫేర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. అనంతరం చల్లపల్లి లక్ష్మీపురంలోని లేఔట్లను పరిశీలించారు ఈ కార్యక్రమంలో పిఓపిఆర్డి అశోక్ హౌసింగ్ ఏఈ అరుణ్ కుమారి లతోపాటు తదితరులు పాల్గొన్నారు

ఆర్థిక సాయం

ఉయ్యూరు : సామాజిక సేవా కార్యక్రమాలకు తెలుగుదేశం పార్టీ ముందంజలో ఉంటుందని పార్టీ నాయకులు దండమూడి చౌదరి, గుర్రం చంద్రశేఖర్ అన్నారు. కాటూరులో ఇటీవల ఊరచెరువులో జారిపడి మరణించిన పులి ఉదయ్ కుమార్ తలితండ్రులకు పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రూ. 1,10,116 ఆర్థిక సాయం శనివారం అందజేశారు. ఈసందర్భంగా మండల పార్టీ సెక్రటరీ కాటూరు శరత్ మాట్లాడుతూ వైసీపీ నాయకుల ధనదాహానికి ఉదయ్ కుమార్ బలయ్యాడని, తెలుగు యువత నాయకుడు కోడె హరీశ్, పార్టీ నాయకులు వేమూరు శ్రీనివాసరావు, యుగ బాబు, కోటయ్య, ఎస్.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌కిశోర్‌నాయుడు వితరణ

చల్లపల్లి : మండల పరిధిలోని బొబ్బ శ్రీనివాసరావు ఇల్లు ఇటీవల విద్యుత్ ఘాతంతో పూర్తిగా కాలిపోవడంతో కుటుంబ సభ్యులు నిరాశలయ్యారు. విషయం తెలుసుకున్న శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు శనివారం బాధితులను పరామర్శించి రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రేమాల శ్రీనివాసరావు, ఎంపీడీవో అన్నే లక్ష్మీ రామకృష్ణప్రసాద్, రజనీకాంత్, మాజీ సర్పంచ్ మురాల శ్రీనివాసరావు, బొల్ల సహదేవుడు, వేములమడ కన్నారావు, పూసలపాటి ఏసేపు తదితరులు పాల్గొన్నారు. వైసిపి నాయకులు పారిశ్రామికవేత్త వేముల మన సతీష్ అందించిన ఆర్థిక సహాయాన్ని మాజీ సర్పంచ్ వేములమడ నాగేశ్వరరావు బాధితుల గృహం వద్ద కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాత నాంచారయ్య,కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

23న ఉచితవైద్య శిబిరం

గన్నవరం : ఈ నెల 23న విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని గన్నవరం విశ్రాంత ఉద్యోగ సంఘం అధ్యక్షులు ఆవుటపల్లి మోహనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నవరం బుద్ధవరం రోడ్డులోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో కృష్ణ సాయి డెంటల్ డాక్టర్లు, విజయవాడ మ్యాక్సి విజన్ కంటి డాక్టర్లు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. పెన్షన్‌దారులు ఆర్యోగ్య కార్డు ఐడి కార్డులు, ఆధారకార్డు లింక్ చేసుకోవాలన్నారు.

17 మందికి కంటి పరీక్షలు

గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. ఈ శిబిరంలో 17 మందికి కంటి పరీక్షలు నిర్వహించి తొమ్మిది మందికి శుక్లాల ఆపరేషన్ కావాల్సిందిగా వైద్యులు నిర్ధారించారు. వీరికి 24న బొమ్మలూరులోని కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరీక్షలకు భద్రతా ఏర్పాట్లు : ఎస్ఐ

గుడ్లవల్లేరు : ఆదివారం జరిగే కానిస్టేబుల్ పరీక్షలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లుచేశామని గుడ్లవల్లేరు ఎస్ఐ వి.ఏసేబు చెప్పారు. గుడ్లవల్లేరు మండలంలోని పలు

కళాశాలల్లో పరీక్షలు జరగనున్నాయన్నారు. ఎస్సార్ శేషాద్రిరావు ఇంజనీరింగ్ కళాశాలలో 1671 మంది, ఏ ఏ ఎన్ ఎం అండ్ వి వి ఎస్ ఆర్ ఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో 960 మంది, ఫార్మసీ కళాశాలలో 312 మంది పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తగు సమయంలోనే పరీక్ష కేంద్రాల వద్ద హాజరుకావాలని కోరారు. పరీక్షకేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

హామీల అమలుకు 108 ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీలు అమలు

చేయాలనీ, లేదంటే సమ్మెకు వెళ్తామని డిమాండ్ చేస్తూ 108 ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ధర్నా చౌక్ ఎదుట నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు 108లో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఇఎంటి, పైలట్లను వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. 24 గంటలు ప్రజలకు ఉచిత అత్యవసర వైద్య సేవలు 108 అంబులెన్స్ ద్వారా అందించటంలో నిరంతరం కష్టి చేస్తున్న ఉద్యోగులకు ప్రతి నెలా జీతాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. కొద్ది మంది అధికారుల వేధింపుల కారణంగా ఉద్యోగం ఉంటుందో, ఎప్పుడు తొలగిస్తారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. చిన్న కారణాలకు కూడా సరైన విచారణ లేకుండా డివిజన్, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌ఫర్, సస్పెన్షన్, టెర్మినేషన్ వంటి నిర్ణయాలు తీసుకొంటూ అనేకమందిని ఇప్పటికి యాజమాన్యం వారు విధులకు దూరం చేశారన్నారు. సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు బూర సుబ్రహ్మణ్యం,సి హెచ్ జయరావులు సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో 108 ఉద్యోగ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మురాల అమలేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవులు, జిల్లా కోశాధికారి సూరిబాబు, డివిజనల్ కోశాధికారి రమణ, వెంకటాద్రి, సుమను, వెంకటరమణ, దినేష్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఫ్యామిలీ డాక్టర్ : గీతాబాయి

గన్నవరం(హనుమాన్ జంక్షన్) : గ్రామాల్లో సమర్థవంతంగా ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారిణి గీతాబాయి తెలిపారు. శనివారం గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు.వైద్యాధికారి నారయ్య, ఎఎన్ఎం సుశీల, ఆరోగ్య పర్యవేక్షకులు అప్పారావు, ఎంటిపిఎల్ నాగరాజు, పి.రవికుమార్, ఆశా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

మచిలీపట్నం రూరల్ : వ్యవసాయంలో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించటం ద్వారా అధిక దిగుబడులను సాధించొచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్‌వివిఎస్ మనోహర్‌రావు అన్నారు. మచిలీపట్నం మండలం అరిసేపల్లి గ్రామంలో శనివారంనాడు 'మంచి వ్యవసాయ పద్ధతులు'పై అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. గత మూడేళ్లుగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంచి వ్యవసాయ పద్ధతులు సాగుపై రైతులకు అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. మచిలీపట్నం ఎడిఎ శ్రీనివాసరావు, మండల వ్యవసాయశాఖ అధికారి జి.వి.శివ ప్రసాద్ మాట్లాడారు. పిఏసిఎస్ అధ్యక్షులు సాక్షి చంద్రశేఖర్, కొప్పరపు బాబు, చండిక అజయ్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

బి ఫార్మసీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో బి.ఫార్మసీ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లకు సంబంధించిన స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఈ నెల 24న ఉదయం 10 నుండి 11 గంటల లోపు రిపోర్ట్ చేసిన అభ్యర్థులకు నిర్వహిస్తామని డైరెక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. స్పాట్ అడ్మిషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.1200 చెల్లించాలని పేర్కొన్నారు. బి.ఫార్మసీ కోర్సులలో సీటు పొందగోరు అభ్యర్థులు ఎపిఇఎపిసెట్ -2022 (బైపిసి) ర్యాంకుతో పాటు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించాలని కోరారు.

ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

చల్లపల్లి : కృష్ణాజిల్లా ఆటో యూనియన్ చల్లపల్లి బస్టాండ్ సెంటర్ పాయింట్ యూనియన్ ఎన్నికలు శుక్రవారం సాయంత్రం స్థానిక గుంటూరు బాపనయ్య భవనంలో నిర్వహించారు. అధ్యక్షులుగా రావూరు దావీదు, కార్యదర్శిగా వాసర వీరబాబు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఆరంబాక నాగమల్లేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా సోమిశెట్టి శ్రీనివాసరావును ఎన్నికయ్యారు. కోశాధికారిగా నెరుసు నాగరాజు, సహాయ కోశాధికారిగా యర్రంశెట్టి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులుగా పెద్దిపోయిన సాంబశివరావు, పెదప్రోలు ఉమామహేశ్వరరావు, బూరేపల్లి గంగయ్యలను ఎన్నికయ్యారు. యూనియన్ గౌరవ అధ్యక్షులుగా మహమ్మద్ కరీముల్లా, గౌరవ సలహాదారులుగా వెనిగళ్ళ వసంతరావులను ఎన్నుకున్నారు.

'స్పందన'కు లక్ష విరాళం

గన్నవరం : గన్నవరం మండలం దావాజీగూడెంలోని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో స్పందన మానసిక వికాస కేంద్రానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ వేములపల్లి అనురాధ కుమారుడు అమెరికా వాషింగ్టన్ చెందిన ప్రవాస భారతీయుడు కాజా విజయరానా ఆర్ధి, వారి కుమారులు అనురాగ్,ప్రితీష్ చేతుల మీదుగా శనివారంనాడు రూ.లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పిఎంజి కీర్తి, స్పందన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆర్యోగంపై శ్రద్ధ వహించాలి : అఖిల్

గుడివాడ : చిన్నతనం నుండే పిల్లల ఆర్యోగం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహిస్తే చిన్నారులు ఎలాంటి అనారోగ్యం భారిన పడబోరని పెలికాన్ ఆసుపత్రి వైద్యులు చిట్టూరి అఖిల్ అన్నారు. శనివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని వండర్ కిడ్స్ స్కూల్‌లోని 250 మంది విద్యార్థులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు అఖిల్ మాట్లాడుతూ చిన్న పిల్లల ఎదుగదలకు, దంతల పరీక్షణకు, తల్లిదండ్రులు ప్రతేక శ్రద్ధ కనబరిస్తే పిల్లలు పూర్తిగా ఆర్యోగంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వై.శ్రీహర్షగౌతమ్, ప్రిన్సిపల్ వద్దాది కృష్ణకుమారి, పులపా చంద్రశేఖర్, ఎం.డి విష్ణుచైతన్య తదితరులు పాల్గొన్నారు.

సరసమైన ధరలకే నాణ్యమైన భవన నిర్మాణ సామాగ్రి

ప్రసాద్ ట్రేడర్స్ అధినేత ఉప్పాల శివరామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పమిడిముక్కల

ప్రతిఒక్కరూ గృహాలు సొంతంగా నిర్మించుకోవాలనే లక్ష్యంతో సరసమైన ధరలకు అందుబాటులో సిమెంటు, భవనాలకు కావాల్సిన సామాగ్రిని విక్రయిస్తున్నామని పమిడిముక్కల మండలం వీరంకిలాకు గ్రామానికి చెందిన ప్రసాద్ ట్రేడర్స్ అధినేత ఉప్పాల శివరామ్‌ప్రసాద్ చెప్పారు. ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఖాతాదారుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన సామాగ్రిని అందజేస్తున్నామన్నారు. పమిడిముక్కల మండలంలోని

వీరంకిలాకుతోపాటుగా కృష్ణాపురం,ఆగినపర్రు, మేడూరు, కపిలేశ్వరపురం తదితర గ్రామాల నుంచి తమకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. గత పదేళ్లుగా వినియోగదారుల ఆదరాభిమానాలతో తమ సంస్థను విజయవంతంగా నడిపిస్తున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు-పేదలందరికి ఇళ్ల పథకం ద్వారా జగనన్న, వైఎస్సార్‌కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన భవన నిర్మాణ సామాగ్రిని కూడా అందజేస్తున్నామన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగంగా జరగాలి

పెదపారుపూడి ఎంపిపి గోగం సురేష్

ప్రజాశక్తి-పెదపారుపూడి

నవరత్నాలు-పేదలందరికి ఇళ్లు పథకం ద్వారా జగనన్న,

వైఎస్సార్‌కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టిందన్నారు. లబ్ధిదారులకు అవగాహనకల్పించటం ద్వారా ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోందన్నారు. వెంట్రప్రగడ జగనన్న కాలనీకి రూ.6 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కాలనీకి రోడ్లు, తాగునీటి పైపులైన్లు, విద్యుత్ వంటి సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో టి.సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

షాహిదా బేగం మృతికి టిడిపి సంతాపం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

టిడిపి మహిళా నాయకురాలు, మాజీ కౌన్సిలర్ షాహిదా బేగం అకాల మరణం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర అన్నారు. షాహిదా బేగం అకాల మరణం పట్ల మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక నియోజక వర్గ కార్యాలయంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఆవిడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఎం వి బాబా ప్రసాద్,పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇలియాస్ పాషా, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్‌సి రామ్మూర్తి జయంతి

ప్రజాశక్తి - భవానీపురం : విశ్వబ్రాహ్మణ ప్రముఖులు, మాజీ శాసనమండలి సభ్యులు రావు సాహెబ్ పండిత గానాల రామ్మూర్తి 131వ జయంతి కార్యక్రమం శనివారం గొల్లపూడిలోని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అధ్వర్యంలో జరిగింది. ముందుగా గానాల చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ 1930 సమయంలో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో శాసనమండలి సభ్యులుగా పనిచేసి విశ్వబ్రాహ్మణుల భవిష్యత్ కోసం బ్రిటిష్ ప్రభుత్వంను ఒప్పించి బీసీలుగా చేర్చిన మహనీయుడు పండిత గానాల అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు మరొకసారి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చేవూరి రామస్వామి మాట్లాడుతూ గానాల విశ్వబ్రాహ్మణ కులానికి జాతి పిత వంటివారని, మా అందరికీ ఆదర్శనీయులు అని అన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సున్నపు వీరభద్ర చారి, జవ్వాది సుదీర్, చిట్లురి హరీష్, రమేష్ ,మహిళ నాయకులు నీరజ,రేణుక,బీసీ నాయకులు శేషగిరరావు, కరీం ఖాన్, బాబురావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి -తిరువూరు :** ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ఎంఎల్ సి, విశ్వబ్రాహ్మణులను బిసి జాబితాలో చేర్చటానికి అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు స్వర్గీయ రావు పండిత గానాల రామమూర్తి 131వ జయంతి ని విశ్వబ్రాహ్మణ సంఘం తిరువూరు పట్టణ కమిటీ శనివారం ఘనంగా నిర్వహించింది. ఆయన చిత్ర పటానికి పూలమాల వేవి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చామర్తి రాంబాబు, ప్రధాన కార్యదర్శి జివివి బ్రహ్మాచారి, స్వర్ణకార సంఘం అధ్యక్షులు ఏలేశ్వరపు కుమార్ రాజా, సంఘం ప్రతినిధులు రమేష పాల్గొ న్నారు.

రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ తదితరులు

ఆధార్ ప్రత్యేక క్యాంపులు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని సచివాలయాల్లో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తున్న నేపధ్యంలో ఇబ్రహీంపట్నం పరిధిలో ఈనెల 23 24 తేదిలలో ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం మండల అభివృద్ధి అధికారి బాణావత్ రామకృష్ణ నాయక్ తెలిపారు. శనివారం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల తుమ్మలపాలెంలో ఆధార్ క్యాంప్ నిర్వహించినట్లు తెలిపారు. 23, 24న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ఆధార్ అప్‌డేట్ కోసం వినియోగించుకోవాలని కోరారు.

శివశక్తి నగర్లో బస్‌స్టాప్‌కు వినతి

ప్రజాశక్తి - భవానీపురం : నగరానికి సమీపంలోని చనుమోలు వెంకట్రావు (సివిఆర్) పై ఓవర్ బ్రిడ్జి దిగువున గల శివశక్తి నగర్ వద్ద ఆర్టీసి రూటు బస్సులు, సిటీ బస్సులు రిక్వెస్ట్ స్టాప్ కోసం శనివారం విద్యాధరపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కనకమేడల బ్రహ్మేశ్వరరావుకి స్థానికులు వినతిపత్రం సమర్పించారు. ఆ ప్రాంతాల్లోని సాయి అమరావతి హైట్స్, అస్త్ర అపార్ట్మెంట్, విఘ్నేష్ హైట్స్ ,అలాగే బచ్చు అమర్నాథ్ అపార్ట్మెంట్ వాసులు సుమారు వందలాది కుటుంబాలు సిటీ బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని శివశక్తి నగర్‌లో ఆపాలని స్థానికులు (అభ్యర్ధన) సంతకాలతో కూడిన విఎనతి పత్రాన్ని అందించారు. వినతిపత్రం అందించిన వారిలో అస్త్ర అపార్ట్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు యేమినేని వెంకట రమణ, కార్యదర్శి బొలిశెట్టి బ్రహ్మానందరావు, నాగేశ్వరరావు వున్నారు.

ఆలయాల జీర్ణోద్ధారణకు నిధులు : సామినేని

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : జగ్గయ్యపేట పట్టణ మున్సిపాలిటీలో సముచిత స్థానమైన మున్సిపల్ కో ఆప్షన్ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన మంగు చైతన్య శర్మకు ఇచ్చిన సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో ఉన్న బ్రాహ్మణ సంఘాలన్ని కలిసి ఆత్మీయ అభినందన సన్మాన సభ పట్టణంలోని అయ్యప్పనగర్ శ్రీ గాయత్రి కళ్యాణ వేదికనందు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొని మాట్లాడారు. వైసిపిలో బ్రాహ్మణులకు సముచితస్థానం ఇస్తున్నట్లు తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంలో 11 దేవాలయాలకు జీర్ణోధరణకు ఆర్థిక ఫండ్స్ కేటాయించడమే కాకుండా జగ్గయ్యపేట పట్టణంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి కళ్యాణమండపం కూడా రెండున్నర కోట్ల రూపాయలతో నిర్మిస్తామన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ పెద్దలందరూ కలిసి సామినేని ఉదయభానుని ఘనంగా సత్కరించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, బ్రాహ్మణ పెద్దలు జగన్నాథరావు, కేశవరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనల్లో ఎంఎల్‌సి అరుణ్

ప్రజాశక్తి-నందిగామ : యేసుక్రీస్తు ద్వారా మానవాళికి దేవుడనుగ్రహించిన శుభసందేశాలను చేరవేయటమే సువార్త సభల సందేశం అని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పేర్కొన్నారు. నందిగామ పట్టణంలోని అయ్యదేవర కాళేశ్వరరావు గ్రౌండ్స్ లో ఇమ్మానుయేలు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సువార్త స్వస్థత మహాసభలలో శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ శనివారం పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దైవజనులు -పలువురు పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రభువైన యేసు నామములో ఆశీర్వాదాలు తెలిపి, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బి జెర్మియా, పాస్టర్ జాషువా, పిల్లి జయరాజు, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇమ్మానుయేలు మినిస్ట్రీస్ పాస్టర్స్ ఎస్.రాజశేఖర్,బి.జెర్మియా, సువార్త మహాసభలు నిర్వాహకులు శంకరరావు పాల్గొన్నారు .

యువగళంతో వైసిపి వెన్నులో వణుకు

ప్రజాశక్తి-విజయవాడ రూరల్ : తెలుగుదేశం పార్టీ యువ నేత నారా లోకేష్ యువగళంతో వైకాపా వెన్నులో వణుకు మొదలైందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర లు పేర్కొన్నారు. గొల్లపూడి కార్యాలయంలో పార్టీ కార్యక్రమాలపై శనివారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27న కుప్పం నుంచి మొదలవుతున్న యువగళం పాదయాత్రకు ఆటంకాలు సష్టించేందుకు వైకాపా ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు చెన్నుపాటి గాంధీ, బాబా ప్రసాద్, కొత్త నాగేంద్ర కుమార్ (నాగబాబు), డూండీ రాకేష్, గూడపాటి పద్మశేఖర్, నూతులపాటి వెంకటేశ్వరరావు (నారద) పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి : వెలంపల్లి

ప్రజాశక్తి-భవానీపురం : స్థానిక 45వ డివిజన్‌లో డ్రైనేజీ సమస్య ఉందని, దాన్ని త్వరితగతిన పరిష్కరిస్తామని మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం 45వ డివిజన్‌లోని 138వ సచివాలయం పరిధిలో 172వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య, వైసీపీ నాయకులు మైలవరపు కృష్ణ, మైలవరపు దుర్గారావు, కర్నాటి రాంబాబు,షేక్ గౌస్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-కంచికచర్ల : పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల రాత పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కంచికచర్ల మండలంలో పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల రాత పరీక్షకు నిర్వహణకు అధికారులు 5 సెంటర్లు ఏర్పాటు చేశారు. కంచికచర్ల మండలంలో ఆదివారం 4072 మంది అభ్యర్థులు రాత పరీక్ష రాయనున్నారు. ఇందుకోసం అధికారులు కానిస్టేబుల్ పోస్టుల వ్రాత పరీక్షకు స్థానిక పేరకలపాడు రోడ్డు సమీపంలో గల దేవినేని వెంకట రమణ అండ్ డాక్టర్ హిమశేఖర్ మిక్ ఇంజనీరింగ్ కళాశాలలో 2 సెంటర్లు, కీసర సమీపంలో గల బీజేటి కళాశాల, పరిటాల సమీపంలో గల అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాల, ఎంవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను విజయవాడ డీసీపీ మేరి ప్రశాంతి, నందిగామ ఏసిపి కె నాగేశ్వర్ రెడ్డి, పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీపీ మేరి ప్రశాంతి

యుటిఎఫ్ కౌన్సిల్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : నందిగామలో ఆదివారం జరగనున్న యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధమ నూతన కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం రెడ్డిగూడెం మండల కేంద్రం అమర్ భవన్ నందు యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు పిల్లి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. అధిక సంఖ్యలో యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు ఉపాధ్యాయులు మండలం నుండి హాజరుకావాలని ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పి భవాని పిలుపునిచ్చారు. ఎక్కువమంది ఉపాధ్యాయులు మన మండలం నుండి జిల్లా కౌన్సిల్కు హాజరవుతారని ప్రధాన కార్యదర్శి ఎం బాల కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి భవాని, మహిళా కార్యదర్శి ఎం రాజేశ్వరమ్మ, జిల్లా కౌన్సిలర్ బి నాగరాజు నాయక్, మండల శాఖ గౌరవాధ్యక్షులు శ్రీ డి శేషగిరి, అధ్యక్షులు పి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి మిక్కిలి బాలకోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కట్టా రవిబాబు, కోశాధికారి మల్లాది తిరుపతిరావు, కార్యదర్శులు నందిగం సత్యం, మరియు కట్టా విజయ్ కుమార్ హాజరయ్యారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎంఎల్‌సి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనార్థం రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, శాసన మండలి సభ్యులు తలశిల రఘురాం శనివారం అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ వేదంపండితులు వీరికి వేదాశీర్వచనం చేయగా కార్యనిర్వాహణాధికారి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

విదేశాల్లో ఉన్నత విద్య పట్ల విద్యార్థుల ఆసక్తి

- యుఎస్‌ఎ స్టడీ ఎక్స్‌పోకు మంచి స్పందన
- 700 మంది విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడానికి ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని, విదేశాలలో చక్కటి విద్యావకాశాలు ఉన్నాయని గ్లోబల్ ట్రీ బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ కపర్ధి అన్నారు. గ్లోబల్ ట్రీ ఆధ్వర్యంలో నగరంలోని ఫార్చ్యూన్ మురళి హోటల్‌లో శనివారం 'యుఎస్‌ఎ స్టడీ ఎక్స్‌పో -2023' జరిగింది. ఈసందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమెరికాకు చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులుస్వయంగా వచ్చి వారి విద్యా విధానం గురించి తెలియచేయడంతో విద్యార్థులు ఆసక్తిగా తెలుసుకోవడం కనిపించింది. సుమారు 700 మంది విద్యార్థులు ఈస్టడీ ఎక్స్‌పోకు హాజరై ఉన్నత విద్యావకాశాల గురించి తెలుసుకున్నారు. తొలుత గ్లోబల్ ట్రీ బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ కపర్థి మాట్లాడుతూ అమెరికాలోని టాప్ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యా కోర్సుల గురించి తెలియచేయడానికి తమ సంస్థ ప్రతి ఏటా స్టడీ ఎక్స్‌పో నిర్వహిస్తుందన్నారు. సుమారు 50 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొని కోర్సుల గురించి తెలియచేశారన్నారు. నార్త్ అమెరికా హెడ్ భాను ప్రకాష్ మాట్లాడుతూ కరోనా తరువాత ఎక్కువ చాలా మంది ఉన్నత కోర్సులకు విదేశాలకు వెళ్లాలంటే సరైన గైడెన్స్ లేదన్నారు. అటువంటి వారికి విదేశాలలో విద్యావకాశాల గురించి తెలియచేసేందుకు ఈస్టడీ ఎక్స్‌పోను నిర్వహించామని విద్యార్థుల నుండి మంచి ఆదరణ రావడం ఆనదంగా ఉందన్నారు. గ్లోబల్ ట్రీ ఏరియా మేనేజర్ వై.ప్రశాంత్ మాట్లాడుతూ స్టడీ ఎక్స్‌పోకు మంచి స్పందన లభించిందని ఒకవేళ ఎవరైనా హాజరుకాలేని వారు ఎం.జి.రోడ్డు ఎయిర్‌టెల్ ఆఫీస్ ఎదురుగా గల తమ కార్యాలయం నందు సంప్రదించవచ్చని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేయాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు

రోడ్డు నియమ నిబంధనలు పాటించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూడొచ్చునని జిల్లా రవణా అధికారి సీతాపతి అన్నారు. 34వ రహదారి భద్రతా వారోత్సవాలు, స్వచ్ఛత - భద్రతను పురస్కరించుకుని ఉయ్యూరు రవాణా యూనిట్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణా రిక్రియేషన్ క్లబ్ ఆడిటోరియంలో శనివారం ఆటోమొబైల్ కార్మికులు, డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేగం కన్నా ప్రాణం ముఖ్యమని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే అనర్ధాలను వివరించారు. వాహనాల్లో ప్రయాణం చేసే వారి ప్రాణాలు డ్రైవర్ల చేతిలో ఉంటాయన్నది గుర్తెరగాలని సూచించారు. ఉయ్యూరు యూనిట్ అధికారి సుబ్బారావు, నారాయణ స్వామి, తహశీల్దార్ మస్తాన్, ఎంపీడీవో విమాదేవి, ఆర్టీసీ డీఎం ప్రసాద్, పమిడిముక్కల సీఐ కిషోర్‌బాబు పాల్గొని రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. పట్టణ పోలీస్ ఆధ్వర్యంలో ఉయ్యూరు పట్టణ పోలీస్ ఆధ్వర్యంలో శ్రీశ్రీనివాస డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కంకిపాడు సీఐ పరమేశ్వర్ రోడ్డు నియమాలు వివరించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, త్రిబుల్స్ రైడింగ్ ప్రమాదకరమన్నారు. రోడ్డుపై ప్రయాణించేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సవివరంగా వివరించారు. పట్టణ ఎస్ఐ ఎన్.వీరప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధనరావు పాల్గొన్నారు.

ఉయ్యూరులో మాట్లాడుతున్న సీతాపతి

మచిలీపట్నంలో

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

34వ రోడ్డు భద్రత వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక బీచ్ రోడ్డులో వాహనదారులకు, ప్రయాణికులకు బందరు తాలూకా పోలీసులు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వై వి వి సత్యన్నారాయణ మాట్లాడుతూ జిల్లాలో ఈ మధ్యకాలంలో జరిగిన రహదారి ప్రమాదాలలో ఎక్కువ శాతం యువకులే బలయ్యారన్నారు. సరదాల కోసం వాహనాల జోలికెల్లి ప్రమాదాల భారిన పడొద్దని సూచించారు. తల్లిదండ్రులు వాహనాలపై బయటకు వెళ్ళిన మైనర్ పిల్లలపై దష్టి సారించాలని కోరారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ రూల్స్, వాహనాలకు సంబంధించి రికార్డులు వంటి అంశాలను వివరించారు.

ఘంటసాలలో

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం : ఎస్ఐ

ప్రజాశక్తి-ఘంటసాల

హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకం, ప్రమాదకరమని ఘంటసాల ఎస్ఐ కుడిపూడి శ్రీనివాస్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఘంటసాలలో హెల్మెట్ డ్రైవింగ్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఘంటసాల పోలీసు స్టేషన్ నుంచి ప్రధాన సెంటర్ మీదుగా బ్యాంకు సెంటర్ వరకు ఎస్సై శ్రీనివాసు ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించిన పోలీసు సిబ్బంది ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్సై శ్రీనివాసు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ప్రకారం ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. అతివేగం, నిర్లక్ష్యం, అదుపు తప్పినపుడు, పొరపాటున జరిగే రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు తలకు దెబ్బలు తగలకుండా సురక్షితంగా బయటపడేందుకు హెల్మెట్ రక్షణ కవచంలా ఉపయోగపడుతుందన్నారు. ఈ ర్యాలీలో మహిళా పోలీసులు, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ రంజిత్‌బాషాకు సమీర్‌శర్మ ప్రశంసలు

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లాలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి, గ్రామదర్శిని కార్యక్రమం అమలుకు రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఎంతో ఉపయోగకరంగా ఉందని సిఎం

ఎగ్జిక్యూటివ్ డాక్టర్ సమీర్‌శర్మ అన్నారు. మచిలీపట్నం కలెక్టరేట్ స్పందన కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి 8 ప్రధాన సూచీలపై సమీర్‌శర్మ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనకు తీసుకుంటున్న చర్యలను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా వివరించారు. వీటి అమలుకు ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ గురించి తెలిపారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను సమీర్‌శర్మ పరిశీలించారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్ర వ్యాప్తంగా ఉపయోగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని వినతి

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ మండల పరిధిలోని దక్షిణ చిరుగోలంక గ్రామంలో గత కొంతకాలంగా జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు, ట్రాక్టర్ల ద్వారా

తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న జనసేన నాయకులు

రవాణా అడ్డుకోవాలని తహశీల్దార్ ఎల్ వి ఎస్ రామకృష్ణకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. శనివారం జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గత రెండు రోజుల క్రితం ఇదే విషయమై జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశామనీ, అయినా మట్టి తవ్వకాలు ఆపక పోవడంతో అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, గ్రామస్తులు కూడా పాల్గొన్నారు. అవనిగడ్డ పోలీస్ స్టేషన్లో కూడా వినతి పత్రం అందజేశారు.

కార్మికులు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.వి.ఆర్ కృష్ణయ్య

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

నిర్మాణ రంగంలో ఉన్న కార్మికులందరూ చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ కార్యదర్శి కె.వి.ఆర్ కృష్ణయ్య అన్నారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో కార్మికులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కార్మిక వర్గానికి

మాట్లాడుతున్న కె.వి.ఆర్.కృష్ణయ్య

సంబంధించి రాజ్యాంగంలో అనేక చట్టాలు ఉన్నాయన్నారు. కార్మికులు చట్టాలను సద్వినియోగం చేసుకొని వాటి ద్వారా ప్రయోజనం పొందాలన్నారు. పనిగంటలు, కనీస వేతనం, పనిచేసే ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలు వంటివి అనేక హక్కులు ఈ చట్టాల్లో రూపొందించబడ్డాయన్నారు. సహాయ కార్మిక శాఖ అధికారి ఎస్.గోవింద్ మాట్లాడుతూ ప్రతి కార్మికుడు గుర్తింపు సంఘంలో సభ్యత్వం తీసుకుని కార్మికశాఖలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. న్యాయవాది సిహెచ్ ముసలయ్య మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కార్మిక వర్గం సివిల్ కేసులన్నీ పరిష్కరించుకోవచ్చునన్నారు. సిఐటియు నాయకులు బి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ జయరావు ప్రస్తుతం కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ఈ అవగాహన సమావేశంలో పలు రంగాల కార్మికులు పాల్గొన్నారు.

25న జాతీయ ఓటర్ల దినోత్సవం : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ఈ నెల 25న 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు ప్రాముఖ్యతపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష ఒక ప్రకటనలో కోరారు. 25న కేంద్ర ఎన్నికల సంఘాన్ని స్థాపించిన రోజును గుర్తుచేసుకుంటూ 2011లో తొలిసారిగా జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకున్నామన్నారు. 18 ఏళ్లు దాటిన వారిని ఓటు వేసేలా ప్రోత్సహించేందుకు ఏటేటా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ఓటర్ల దినోత్సవం రోజున ప్రతిజ్ఞ చేయడం, సాధార ప్రజలు, విద్యార్థులు ర్యాలీ వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత : సింహాద్రి

ప్రజాశక్తి-అవనిగడ్డ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి అన్ని రంగాల్లో అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మండల పరిధిలోని రాకనూరులో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని తరగతుల ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. అభివద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేయడం ద్వారా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేశంలోనే మంచి ముఖ్యమంత్రిగా గుర్తింపు తెచ్చుకున్నారని వివరించారు. ముందు చూపుతో చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాల వల్ల రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని వివరించారు. మంచి పాలన అందిస్తున్న జగన్మోహన్ రెడ్డికి మరోసారి అవకాశం ఇస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమల్లోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైసిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, నియోజకవర్గ యువ నాయకులు సింహాద్రి వికాస్ బాబు, తుంగలవారి పాలెం సర్పంచ్ తుంగల వాసు దేవరాజు, గ్రామ పార్టీ కన్వీనర్ తుంగల వేణుగోపాలస్వామి, ఎంపిటిసి సభ్యులు వర్రే నరేష్ బాబు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, పార్టీ నాయకులు గరికిపాటి వెంకటకృష్ణారావు, దవారి అనిల్ కుటుంబరావు, ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బుక్‌లెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మొక్కల నాటే కార్యక్రమం

ప్రజాశక్తి-అవనిగడ్డ

మండల పరిధిలోని అశ్వరావుపాలెం గ్రామంలో రోడ్లకు ఇరువైపులా సిమెంట్ పోల్స్ వేసి రోడ్డుకిరువైపులా బుసక రబ్బిస్తో రోడ్లు వెడల్పు చేసి మొక్కలు నాటినట్లు గ్రామ సర్పంచ్ పి లంకమ్మ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తపేట గ్రామ వాస్తవ్యులు దేవన బోయిన రేణుకయ్య జే ఏ ఓ(ఏపీ సిపిడిసిఎల్) జ్ఞాపకార్థం పంద్రాజు నాగ సాంబశివరావు ప్రోత్సాహంతో రేణుకయ్య కుమారులు దేవనబోయిన దివ్య వెంకట కుమార్, నిశాంత్ కుమార్ అందజేసిన రూ.లక్షతో గ్రామం ఒక ద్వారంలో 150 మీటర్ల పరిధిలో స్వచ్ఛ కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరించిన దాతలకు సర్పంచ్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్ గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కానిస్టేబుల్ పరీక్ష

ఎన్టీఆర్ జిల్లాలో 61 కేంద్రాలు, 33,773 మంది అభ్యర్థులు

700 మంది సిబ్బందితో పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి : పోలీసు కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షను ఆదివారం నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు (ఏపిఎస్ఎల్‌పిఆర్‌బి) ఆధ్వర్యంలో ఈ పరీక్షలు జరగనున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పోలీసు అధికారులు, రీజినల్ కోఆర్డినేటర్లు, సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్‌లు సమన్వయంతో పారదర్శకంగా పరీక్షను నిర్వహించనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 33,773 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. జిల్లా వ్యాప్తంగా 61 సెంటర్లలో టెస్ట్ నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఒక గంట ముందు అంటే ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతిస్తామన్నారు. ఉదయం 10 గంటల తర్వాత ఒక నిముషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి ఉండదన్నారు.

మరిన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు : జెసి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : వచ్చే వారం నుండి మండల స్థాయి, ఆర్‌బీకే స్థాయిల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి బహిరంగ మార్కెట్లో ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నట్లు కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ స్పష్టం చేశారు. శనివారం జేసీ

చాంబర్ లో ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి జిల్లాలో రంగు మారిన, పాడైన ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిబంధనలు వారికి వివరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా మంచి గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈసమావేశంలో సివిల్ సప్లయ్స్ డీఎం శ్రీధర్, డిఎస్ వి.పార్వతి, రైసిమిల్లర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగాలి: జెసి

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ అదేశించారు. శనివారం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో జాయింట్ కలెక్టర్ ధాన్యం కొనుగోలుపై కస్టోడియన్ అధికారులకు శిక్షణా నిర్వహించారు. సివిల్ సప్లయిస్ డిఎం ఏ.శ్రీధర్, డిఎస్ఒ వి.పార్వతి, కస్టోడియన్ అధికారులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి : డిటిసి పురేంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : చూపు మందగించడం దూరపు వాహనాలను గమనించలేకపోవడం రోడ్డు ప్రమాదాలకు కారణలవుతున్నాయని, దృష్టి లోపాలు కలిగిన డ్రైవరులు ఎప్పటికప్పుడు కంటి పరీక్షలను చేయించుకోవాలని డిటిసి యం పురేంద్ర కోరారు. స్థానిక బందరు రోడ్డులోని డీటీసీ కార్యాలయంలో శనివారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని డిటిసి యం పురేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా డీటీసీ యం పురేంద్ర మాట్లాడుతూ డ్రైవర్లు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఈ ప్రమాదాలను తగ్గించగలమని, కొంతమంది డ్రైవర్లు కంటి చూపు మందగించినప్పటికి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నారని, దృష్టి. లోపాలతో వాహనాలు నడుపుట వలన దూరంగా వచ్చే వాహనాల రాకపోకలను గుర్తించలేకపోవడం చాల ప్రమాదాలకు దారితీస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో ఆర్ జగదీశ్వర్ రాజు, మోటార్ వాహన తనిఖీ అధికారులు ఆర్ ప్రవీణ్, కె వెంకటేశ్వరరావు, ఎస్ శ్రీనివాస్, పరిపాలన అధికారులు సిహెచ్ శ్రీనివాసరావు, అబ్దుల్ సత్తార్, ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు యం రాజుబాబు, వైద్య బందంబి వసంత, ఎస్ సుజిత, కె రామ్ చరణ్, కె సంజిత, జె సుర్య, ఏ నిఖిల్ పాల్గొన్నారు

విజయవాడలో రోడ్డు భద్రతా ర్యాలీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్, ఆంధ్ర ప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సంయుక్తంగా విజయవాడలోని బెంజ్ సర్కిల్ దగ్గర అసోసియేషన్ హాలు నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు రోడ్డు భద్రతా ర్యాలీ నిర్వహించాయి. తొలుత ఈ ర్యాలీని ఆర్టీఓ జగదీశ్వరరాజు జెండా ఊపి ప్రారంభించారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తుమ్మల లక్ష్మణస్వామి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు శిక్షణ అవసరాన్ని గుర్తించి 28 సంవత్సరాలుగా లాభాపేక్ష లేకుండా డ్రైవింగ్ స్కూలు నడుపుతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 18 నుండి 24 వరకు రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 24 న అసోసియేషన్ హాలులో రోడ్డు భద్రతపై సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీలో అనుబంధ సంఘాల సభ్యులు, డ్రైవర్లు, ట్రైనీలతోపాటు బుర్రకథ కళాకారుల బందం పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

26న ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయండి

దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు పాల్పదుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతు, కౌలురైతుల రుణాలన్నిటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 'విద్యుత్ సవరణ బిల్లు, -2022ను ఉపసంహరింహరణపై మోర్చాతో చర్చించిన తరువాత మాత్రమే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడతాం" అని 2021 డిసెంబర్ 9న సంయుక్త కిసాన్ మోర్చాకు రాసిన లేఖలో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ఎటువంటి చర్చ లేకుండానే కేంద్ర ప్రభుత్వం బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిందని విమర్శించారు. రాష్ట్ర నాయకులు టి.ప్రసాద్ మాట్లాడుతూ రైతు ఉద్యమం సందర్భంగా అమరులైన రైతుల కుటుంబాలన్నిటికీ పరిహారం చెల్లించి, వారి పునరావాసానికి ఏర్పాట్లు చేయాలని అన్నారు. సింఘ్ బోర్డరు వద్ద అమరులైన రైతుల జ్ఞాపకార్థం స్మారక చిహ్నం నిర్మించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించే కార్యక్రమం విరమించుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వే కార్యక్రమం సక్రమంగా జరగడంలేదని, సర్వే లెక్కలు, భూఖండాల విభజనలు, యజమానుల పేర్లు తప్పులతడకలుగా ఉన్నాయన్న విషయాన్ని శాంపిల్ సర్వే చేసిన గ్రామాల అనుభవం తెలియజేస్తోందన్నారు. ఎస్ఒపి ప్రకారం సర్వే జరగడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అందువల్ల స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోసిడ్యూర్ సక్రమంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. టిడిపి రైతు విభాగం అధ్యక్షులు గోపు సత్యనారాయణ, సురేంద్రనాథ్ బెనర్జీ, సిహెచ్.కొండయ్య, టీ తాతయ్య, కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, ఆవుల బసవయ్య, ఎస్.సాంబశివరావు, అన్నే సుబ్బారావు, ఎల్.ఫిలిప్, లంకదాసు అజయ్ ఘోష్ తదితరులు మాట్లాడారు.

సిపిఎం మాజీ వార్డు సభ్యులు, ఐద్వా నేత షేక్ గాలీబి మృతి

ఉదయం 11 గంటలకు యనమలకుదురు ఖబరస్థాన్‌లో జరుగుతాయి.

పలువురు నేతల నివాళి

ఆమె మతి పట్ల సిపిఎం, మహిళా సంఘం సంతాపం తెలిపాయి. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశాయి. గాలీబి భౌతికకాయాన్ని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఆర్.రఘు, సిఐటియు

అరుణపతాకం కప్పుతున్న ఐద్వా నేతలు

పెనమలూరు మండల ప్రధాన కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి ఎం.శ్రీనివాస్ తదితరులు సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సిపిఎం కానూరు కార్యదర్శి పెద్దపూడి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి కృష్ణాజిల్లా కార్యదర్శి షేక్ ఖాసిం, మహిళా సంఘం మండల కార్యదర్శి పాతాళ లక్ష్మి, అధ్యక్షురాలు షేక్ వలీమా, యనమలకుదురు 1వ శాఖ కార్యదర్శి ఇబ్రహీం, నాయకులు టి.జయలక్ష్మి, షేక్ మస్తాన్, ఎం.సత్యం, పలువురు సిపిఎం, మహిళా సంఘం నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు, రాజకీయ నాయకులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

CHANGE OF NAME

I, **KONJETI NAGESWARA RAO (Old Name)**, Resident of 19-92/279, Mahatma Gandhi Complex, Mahendra Nagar, Gollapudi, Vijayawada(Rural), NTR Dist-521225. My Name has been changed to **KONIJETI NAGESWARA RAO (New Name)** Hereafter my name is known as **KONIJETI NAGESWARA RAO.**

CHANGE OF NAME

I, **KONJETI PRASANNA LAKSHMI (Old Name)**, Resident of Shop No.279, First Floor, Mahatma Gandhi Complex, Mahendra Nagar, Gollapudi, Vijayawada(Rural), NTR Dist-521225. My Name has been changed to **KONIJETI PRASANNA LAKSHMI (New Name)** Hereafter my name is known as **KONIJETI PRASANNA LAKSHMI.**

ప్రకటన

సరిహద్దు మునిబాబు తండ్రి మోహన్‌రావు డోర్.నెం. 14/45, గుడివాడపట్టణం, సెల్‌నెం: 9291446388 వారి సంజాయిషీ ప్రకారము ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా
ఈ దిగువ షెడ్యూల్ ఆస్థి బొప్పన సాయిచౌదరి గారు ది.7-10-1982న కొలసాని సామ్రాజ్యం గారిచే క్రయ దస్తావేజు వ్రాయబడి గుడివాడ సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకము 1523 వ వాల్యూమ్ 134వ పుటలలో ద.నెం. 5287/1982 రు రీత్యా రాబడి వారి అనంతరము వారి ఆస్తు లను వారసులు మొత్తము ఆస్తులను ది 8-4-2019 (Doet No.695/2019) అవనిగడ్డ సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసులో పంపకము దస్తావేజు వ్రాసుకొనియున్నారు సదరు పంపకములో ఈ దిగువ ఆస్థి మరియు ఇతర ఆస్తులు "ఎ" షెడ్యూల్ ఆస్తిగా బొప్పన రమేష్ గార్కి రాబడినది. 5287/1982 నెంబరు దస్తావేజు పోయినదని పేపరు పబ్లికేషన్, పోలీసు సర్టిఫికేట్ తీసుకొనియున్నారు ఈ దిగువ ఆస్తిని బొప్పన సాయిచౌదరి గారి కుమారుడు బొప్పన రమేష్ నా క్లయింట్‌కు అమ్ముటకు ఒప్పందము చేసుకొనియున్నారు. సదరు ఒప్పందము ప్రకారము నా క్లయింట్ రిజిష్టర్డ్ దస్తావేజు వ్రాయించుకొనబడును. కావున ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల నాక్లయింటుకు లిఖితపూర్వకముగా వారంరోజుల లోపు నాక్లయింటుకు తెలియజేయవలెను. ఎటువంటి అభ్యంతరములు లేని యెడల నాక్లయింట్ ఖరీదు దస్తావేజు వ్రాయించుకొనును. దర్మిలా ఎటువంటి అభ్యంతరములు నాక్లయింటును బైండు చేయదు.

షెడ్యూల్

గుడివాడ సబ్‌రిజిష్టార్ వారి యిలాకా గుడివాడ మున్సిపల్ 10వవార్డులో చేరిన వలివర్తిపాడు గ్రామ రీసర్వే నెం. 202.2 డోర్‌నెం. 10/154. హెచ్.6,రు, అసిస్మెంట్ నెం. 1068005643రు దాఖలా చ॥గ 407 స్థిరాస్థి నివేదన స్థలము అందలి ఆర్.సి.సి. మేడ బిల్డింగ్‌నకు హద్దులు.తూర్పు: యి వైపున స్వంతగోడ ఆవల మున్సిపల్‌బజారు 49.6, దక్షిణం: యి వైపున స్వంత గోడ ఆవల మున్సిపల్ బజారు. 74.0, పడమర:యివైపున స్వంత గోడ ఆవల లింగం రత్నకుమారి గారి ఆస్తి 49.0, ఉత్తరం: పొట్లూరి వెంకటఅప్పారావు గారికిన్ను యి వాటాదారు ఆస్తికిన్ని జాయింటు హక్కులు గల జాయింటు ప్రహారీ గోడ 674.0

గుడివాడ **T.Sankara Rao,**
20-01-2023 Advocate & Notary Public
16/36, S.N.Puram, Gudivada-521301
Cell: 9440260248

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT AVANIGADDA
E.P. NO. 7/2022 IN OS NO.142/2014

Between :
State Bank of India, Avanigadda Main Branch, Rep. by its Branch Manager, Avanigadda ... DHR / Plaintiff
And
Maddi Murali rao ... JDr / Defendent
To,
Maddi Murali Rao, S/o Subba Rao, Hindu, Aged about 38 years, Properties, R/o D.No. 1-456, 1st Ward, Near Pragathi School, Avanigadda Village and Mandal.

పై నెంబరు ఇ.పి.లో మీ హాజరు నిమిత్తం చివరిసారిగా ది. 25-1-2023 సం॥ తేదీ నాటికి వాయిదా ఉన్నది. సదరు వాయిదారోజున పై కోర్టులో ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరఫు ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు ఏమైనా ఉన్నయెడల కోర్టువారికి తెలియపర్చవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(పై కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా : 25-1-2023
అవనిగడ్డ.
తేది : 21-1-2023 ఇట్లు
Sanaka Raghu Rama Prasad, B.Com, B.L., Advocate, Avanigadda.
Ph : 99499 88835

CHANGE OF NAME

I, **GEDDA VENKATA MAHA LAKSHMI (Old Name)**, Resident of Block-3, Part-C, 4th Floor, Flat No.7, Jamac Residencial Housing Complex, APIIC Colony, Autonagar, Vijayawada (Urban), NTR Dist-520007. My Name has been changed to **VENKATA MAHALAKSHMI GADDA (New Name)** Hereafter my name is known as **VENKATA MAHALAKSHMI GADDA.**

మహారాజశ్రీ 8వ అదనపు జిల్లా జడ్జి గారు
విజయవాడ
క్రి.యం.పి. నెం. 153/2022 in
క్రి. అపిల్. నెం. 65/2019

బిట్వీన్:
గుంజ్జ జమలయ్య .... పిటిషనర్/అప్పిలెంటు
మరియు
మెక పద్మకృష్ణా ... రెస్పాండెంట్
టు,
మెక పద్మకృష్ణా, భర్త పద్మరావు, పెంతెకోస్టల్ చర్చి, సుందరయ్యనగర్, విజయవాడ-15.

పై నెంబరు పిటిషన్‌లోని రెస్పాడెంట్ అయిన మీరు ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపినను అందు కొనక కాలయాపన చేయుచున్నారు అందువలన శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ నోటీసు ద్వారా తెలియపర్చునది ఏమనగా ది.30-01-2023నాడు ఉదయం 10.30 ని॥లకు శ్రీకోర్టువారి ఎదుట స్వయంగా గాని మీ న్యాయవాది ద్వారా హాజరు కావలెను లేనియెడల మీ పరోక్షమున క్రి.యం.పి, క్రి.అప్పిల్ కేసును శ్రీకోర్టు వారు తీర్మానించెదరని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

వాయిదా తేది. 30-01-2023.

(బై కోర్టు ఆర్డర్)

పి.రవికుమార్
అప్పిలేంట్ తరుపు న్యాయవాది

మహారాజశ్రీ గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 180/2012

బీట్వీన్:
మెల్లబోయిన సంపూర్ణమ్మ ....వాది
మరియు
గౌరిపర్తి సత్యనారాయణ మరియు ఇతరుల ....ప్రతివాదులు

To,
1. కొలుసు వరలక్ష్మి D/o, వీరరాజు, వయసు 41 సంవత్సరాలు, పాటిమీద, వెంట్రప్రగడ, పెదపారుపూడి మండలం,కృష్ణాజిల్లా (డి-15)
2. కొలుసు ధనుంజయ, S/o, వీరరాజు వయసు 48 సంవత్సరాలు, పాటిమీద, వెంట్రప్రగడ, పెదపారుపూడి మండలం, కృష్ణాజిల్లా (డి-16)
3. జట్టి. వెంకట్రావమ్మ, W/o, వెంకటేశ్వరరావు వయసు 56 సంవత్సరాలు, బైపాస్ రోడ్డు, గుడివాడ కృష్ణాజిల్లా. (డి-19)
4. పెద్దిబోయిన శ్రీలక్ష్మి W/o, నారాయణ, @వడ్డీకాసులు, వయసు 40 సంవత్సరాలు, S/o డి.మల్లమ్మ, డోర్ నెం. 5-255, సత్యవరం పోస్టు, తెనాలి మండలం, గుంటూరు జిల్లా. (డి-25)

పై నెంబరు దావాలోని ప్రతివాదులు నెంబరు 15, 16,19,25 కు దావా సమన్లు అమలు నోటీసు నిమిత్తం పైకోర్టులో ది.07-02-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు వాయిదా అయివున్నది. సదరు తేదీన మీరు స్వయంగాగాని లేదా అడ్వకేటు గారి ద్వారా గాని శ్రీకోర్టు వారి యెదుట హాజరు అయి ఆక్షేపణలు వున్న ఎడల తెలియజేసుకొనవలెను. లేని యెడల మీకు పరోక్షముగా తీర్మానించబడునని తెలియ జేయుటమైనది.

(By court order)

గుడివాడ
ది.21-01-2023 ఇట్లు
మెరుగుమాల శ్రీనివాసరావు
అడ్వకేటు, గుడివాడ
సెల్ నెం: **9963049564**

బహిరంగ ప్రకటన

మహారాజశ్రీ VII అదనపు జిల్లా జడ్జి విజయవాడ వారి ఉత్తర్వుల మేర

నా క్లయింట్ **వాది:** నూనె రంగనాయకులు S/o , కోటేశ్వరగుప్త, ప్లాట్ నెం. 10, రోడ్ నెం.2 లోటస్ లాండ్ మార్కు, అయోధ్యనగర్, విజయవాడ
ప్రతివాది: సయ్యద్ ఖలీల్ S/o ఆదాము ప్రొప్రయిటర్- విడ్‌సన్ మోటార్స్, 40-17-5, వల్లూరి పూర్ణచంద్రరావు స్ట్రీట్, పకీరుగూడెం, లబ్బీపేట, విజయవాడ-10. **ఓ.ఎస్.నెం. 237/2016** దావాలో ప్రతివాది అయిన మీరు పై దావాలో నోటీసు నిమిత్తం కోర్టు అమీన రాగా, మీరు అందుబాటులో లేనందువలన ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై దావా 17-2-2023న వాయిదా ఉన్నందున మీరుగాని మీ వకీలు ద్వారాగానీ ఉదయం 10.30.ని॥లకు హాజరుకాగలరు. అట్లు హాజరుకాని ఎడల మీ పరోక్షములోనే పై దావా కొనసాగించబడునని తెలియజేయడమైనది.

ఇట్లు
S. శేషగిరిరావు **BSc.,B.L.**
High Court Advocate,
T4, SriLatha Apartment,
Water Tank, Labbipet,
Date: 21-1-23 **Vijayawada-10.**
Vijayawada **Cell: 9848610239**

ఐలూరు పంచాయతీలో అవినీతి

రికార్డుల తనిఖీలో వెల్లడి : జంపాన

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

మండలంలోని ఐలూరు గ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగినట్టు పంచాయితీ సర్పంచి పిరాటి సుజాత గత కొంతకాలంగా అనేక కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. దీనిపై రికార్డుల తనిఖీ కోరుతూ సమాచార హక్కు చట్టం సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ శనివారం అధికారుల సమక్షంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం జరినట్లుగా గుర్తించామన్నారు. రికార్డుల నిర్వహణలో కూడా అవకతవకలు జరిగాయన్నారు. 2018 సంవత్సరం నుండి ఆడిట్ రిపోర్టులు లేనట్టు నిర్ధారణ జరిగిందన్నారు. దీనిపై రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి, అవినీతి నిరోధకశాఖ ఉన్నతాధికారులకు విచారణ కోసం ఫిర్యాదు చేస్తానన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించేందుకు సహ చట్టం ద్వారా జంపాన శ్రీనివాస్ గౌడ్ అధికారులను కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తోట్లవల్లూరు మండల పంచాయతీల విస్తరణాధికారి కె.ఎ.ఎస్.రవికాంత్ అనుమతించారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పిరాటి సుజాత ,ఈ.ఒ. పి.ఆర్.డి. కె .ఎ.ఎస్.రవికాంత్ ,పంచాయతీ ప్రస్తుత కార్యదర్శి బి.సుభాష్ కుమార్ ,ఇతర సిబ్బంది సమక్షంలో జంపాన శ్రీనివాస్ గౌడ్ గ్రామ పంచాయతీ రికార్డు పుస్తకాలను పరిశీలించారు. ఆయా రికార్డులను తనిఖీ చేసిన ఆయన గ్రామంలో అభివృద్ధి పనులు, సిబ్బంది జీత భత్యాలు, ఆడిట్ రిపోర్టులు తదితర అంశాలపై రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. పలు సంవత్సరాలుగా ఐలూరు గ్రామపంచాయతీకి సంబంధించిన ఆదాయ - వ్యయాలను కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు.

పంచాయతీ రికార్డులు పరిశీలిస్తున్న జంపాన శ్రీనివాసగౌడ్

ఇక్కడి పంచాయతీలో టెండర్ పోస్టులు జిల్లా కలెక్టర్,జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు మేరకు మాత్రమే ఉండాలనీ, ఆ నిబంధనల మేరకు లేవని పేరొకన్నారు. ఒప్పంద ఉద్యోగులకు సంబంధించిన వేతనాల చెల్లింపు అంశాలపై నిబంధనల మేరకు వ్యవహారించలేదని తెలిపారు. పంచాయతీలో ఆర్థిక లావాదేవీల ప్రక్రియకు సంబంధించిన చాలా వరకు ఎలాంటి రికార్డులు లేవనేది గుర్తించినట్టు శ్రీనివాస్ గౌడ్ వివరించారు. రికార్డుల నుండి సేకరించి వివరాల ఆధారంగా నిధులు దుర్వినియోగం, రికార్డుల అవకతవకలకు సంబంధించి రాష్ట్ర ఉన్నతాధికారులకు యు.ఎఫ్.ఆర్.టి.ఐ. ద్వారా ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు. ఐలూరు పంచాయతీ పరిధిలో ఒక్క శివరాత్రి ఉత్సవాల్లో పంచాయతీ రూ.1.70 లక్షలు ఖర్చు రాసినట్టు పరిశీలించినట్టు తెలిపారు. జమా, ఖర్చు పూర్తి వివరాలు ఆడిట్ రిపోర్ట్‌లో మరింత పరిశీలించాల్సి ఉందన్నారు. గ్రామ సభ నిర్వహణ ఖర్చు రూ.28 వేలుగా రికార్డులో పేర్కొన్నారని వివరించారు. కారణాలు తెలపకుండా డైరెక్టుగా బ్యాంక్ నుండి నగదు డ్రా చేసినట్టు తెలిసిందన్నారు.

పంచాయతీల్లో డిపిఒ తనిఖీ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

మండలంలోని గరికపర్రు, కనకవల్లి గ్రామపంచాయతీలను డిపిఒ సంపత్ కుమారి శనివారం

మాట్లాడుతున్న డిపిఒ సంపతికుమారి

సందర్శించి రికార్డులను సామాజిక తనిఖీలో భాగంగా ఆమె పరిశీలించారు. గరికఫర్రు గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రంలో నాడా ఫిట్స్ తయారీ విధానంలో పంచాయతీ వారు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని సక్రమంగా నిర్వహించారని ఆమె అన్నారు. బయట నుంచి సేకరించిన పొడి చెత్తను 45 రోజులు వర్రలలో కుళ్ళబెట్టి అనంతరం వానపాములను వేసి పంట పొలాలకు అనువైన ఎరువుగా తయారు చేయడంలో గరికపర్రు పంచాయతీ వారు సఫలీకతం అయ్యారని ఆమె అభినందించారు. రెండు పంచాయతీల్లోని రికార్డులను తనిఖీ చేశారు. ఇంటి పన్నుల వసూళ్లపై ఆరా తీశారు. కార్యదర్శి బి.ఎస్.పూర్ణేశ్వరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ద్రోన్లతో పురుగు మందుల పిచికారీపై అవగాహన

ప్రజాశక్తి-ఘంటసాల

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాలలో డ్రోన్ల ద్వారా పురుగు మందుల పిచికారిపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

డ్రోన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. పంటలపై రసాయన మందులు పిచికారీ చేయడానికి ఉపయోగపడుతుందని కె.వి.కె పోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత రైతులకు వివరించారు. డ్రోన్ల వినియోగం ద్వారా కూలీల ఖర్చు తగ్గడంతోపాటు పిచికారీ సమయం ఆదా అవుతుందన్నారు. సుమారు 15 లీటర్ల నీటితో డ్రోన్‌ను వినియోగించి ఏడు నుండి పది నిమిషాల్లోనే ఒక ఎకరాకు రసాయన మందులను పిచికారీ చేసుకోవచ్చన్నారు. డ్రోన్ పనితీరు, వాడే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం కె.వి.కె ఫాంలో సాగు చేస్తున్న మినుము పంటలో డ్రోన్ సాయంతో పురుగు మందును పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు మంజువాణి, యశ్వంత్, రేవతి, వెంకటలక్ష్మి, నవీన్, ఇతర కెవికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బడుగు వర్గాలకు రాజ్యాధికారమే ధ్యేయం : వేణుబాబు

ప్రజాశక్తి-గన్నవరం

బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కాలంటే మహాజన సోషలిస్టు పార్టీ అధికారం చేజిక్కించుకోవాలని గన్నవరం నియోజకవర్గ ఆ పార్టీ కన్వీనర్ మంద వేణుబాబు కోరారు. గన్నవరం నియోజకవర్గం తెలప్రోలులో శనివారం సాయంత్రం ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కష్ణమాదిగ నాయకత్వంలోనే దళిత, గిరిజన, మైనార్టీలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. అనంతరం ఎమ్మెస్పి పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పార్టీ అధ్యక్షుడుగా వేల్పూరి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడుగా లంక కృష్ణ, గ్రామ మహిళ అధ్యక్షురాలుగా తొమ్మండ్రు కమలకుమారిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు చౌటపల్లి జెమి, పలివెల పైడయ్య, నాయకులు విశ్వనాథపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను అడ్డుకుంటే ఊరుకునేది లేదు : కొట్టే

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే మహాత్మా గాంధీ ఉప్పు సత్యాగ్రహం సమయంలో చూపిన ధిక్కార బాటనే అవలంబిస్తామని టిడిపి నేత కొట్టే వెంకటరావు హెచ్చరించారు. తన కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకేష్ పాదయాత్రను అడ్డుకుంటే మహాత్ముడు నాటి చట్టాలను ధిక్కరించి ఉప్పు తయారీకి యాత్ర చేశారన్నారు. తాము అలానే చట్టాన్ని ధిక్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కేసులు పెడుతుందో ఎంత మందిని అరెస్టు చేసి జైళ్లకు పంపుతుందో చూస్తామన్నారు. రాష్ట్రంలో మారుమూల పల్లెల్లో కూడా రోడ్లపై ప్రదర్శన చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వం నిషేధ ఉత్తర్వులు ఇచ్చిందంటే జగన్మోన్‌రెడ్డి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తుందా? లేదా హిట్లర్, ముస్సోలినీల రాజ్యాంగాలను అనుసరిస్తుందా? అనేది ప్రజలు గమనించాలని కోరారు. ఇకనైనా వైసీపీ నాయ కత్వం, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని గౌర వించడం నేర్చుకోవాలని ఆయన హితవు పలికారు. ఎమర్జెన్సీలో ఏదైనా జరిగితే కేసు పెట్టారనీ, జీవో నెం1లో దానిని మించి ఏం జరగకుండానే నియంత్రిస్తున్నారని ఆయన మండిపడ్డారు. చంద్రబాబు సభలకు వస్తున్న జన ప్రభంజనాన్ని చూసి వణికిపోతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఏ ఫలితం రాబోతుందో ప్రజలకు తెలిసిపోయే రేపటి నుంచి వారిని గౌరవించరనే భయంతో వైసీపీ నాయకులు ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారని విమర్శించారు.

మాట్లాడుతున్న తాంతియాకుమారి

రాహుల్ నాయకత్వాన్ని బలపరుద్దాం : తాంతియాకుమారి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

అందరూ సమైక్యంగా పనిచేయటం ద్వారా రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దామని కృష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లాం తాంతియ కుమారి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కార్యాలయం పట్టాభి భవన్‌లో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు పర్యటనకు ఇన్‌ఛార్జిలు, మండల, జిల్లా కమిటీలు, అనుబంధ సంస్థల ప్రతినిధులు పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. మండల కమిటీలు నియోజకవర్గం ఇంచార్జులు, జిల్లా కార్యవర్గం అనుబంద అధ్యక్షులు ఎస్సి, ఎస్టీ, బిసి సెల్ అధ్యక్షులు కార్యక్రమాల రివ్యూ చేశారు. గ్రామాలలో పర్యటించే విధంగా రూట్ మ్యాప్ తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిపిసిసి సెక్రటరీ మొహమ్మద్ దాదా సాహెబ్, మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఫిరోజ్ బేగ్, డిసిసి మైనారిటీ సెల్ చైర్మన్ షేక్ ఛాన్ భాష, డిసిసి మీడియా చైర్మన్ ఊటుకూరి శాంతిరాజు, పామర్రు నియోజకవర్గం ఇంచార్జ్ పెదపూడిడి దిలీప్, మచిలీపట్టణం సిటీ ప్రెసిడెంట్ కొడమంచిలి చంద్రశేఖర్, పెడన ఇంచార్జ్ లింగాల సుధాకర్, గూడూరు మండల ప్రెసిడెంట్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ 120వ వర్ధంతి సభ

ప్రజాశక్తి-ఉయ్యూరు

ప్రపంచ కమ్యూనిస్టు అగ్రనేత లెనిన్ 120వ వర్ధంతి సభ ఉయ్యూరు శ్రామిక భవనంలో జరిగింది. తొలిత లెనిన్ చిత్రపటానికి సిపిఎం

నివాళులర్పిస్తున్న ఆర్.రఘు, కె.శివనాగేంద్రం, రాజేష్ తదితరులు

కృష్ణాజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్.రఘు మాట్లాడుతూ సోషలిజాన్ని నిర్మించటానికి లెనిన్ ఎంతగానో కృషిచేశారన్నారు. సిపిఎంజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోసూరి శివ నాగేంద్రం, వీరమాచినేని జ్యోతి, పట్టణ కార్యదర్శి బి.రాజేష్, పట్టణ కమిటీ సభ్యులు సజ్జా బాలగంగాధర్, మదగాని వీరయ్య, వెంకయ్య, నిమ్మాది ప్రశాంతి, నిమ్మాది గోపాల్, కాటూరి ఏసుపాదం, రత్నం భాస్కరరావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తిత్వం కెపి రెడ్డయ్య సొంతం

ప్రజాశక్తి -మొవ్వ

ఎంత ఎదిగినా ఒదిగి ఉండమనే నానుడిని ఆచరణలో చూపిన మహోన్నత వ్యక్తిత్వం కీర్తిశేషులు మాజీ ఎంపి కె.పి.రెడ్డయ్య సొంతమని పలువురు వక్తలు కొనియాడారు. మొవ్వ మండలం కారకంపాడులోని స్వగృహంలో పెనమలూరు ఎంఎల్ఎ కొలుసు పార్థసారథిని పలువురు నేతలు, అధికార అనధికార ప్రముఖులు పరామర్శించారు. ఈ సందర్భంగా కెపి రెడ్డయ్య సేవలను స్మరించుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మంత్రి మేరుగు నాగార్జున, కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, రాష్ట్ర డైరెక్టర్ ఘంటా సంధ్య, కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి జెడ్పీటీసీ సభ్యులు అడవి కృష్ణ, ఈడే వెంకటేశ్వరమ్మ, రామిశెట్టి సత్యనారాయణలతో పాటు పలువురు ఎంపిపిలు,సర్పంచులు, ఎంపిటీసి సభ్యులు, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు రెడ్డయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కె.పి.సారథితో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

నాటిక ప్రదర్శనలు ప్రారంభం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

సుంకర టి. కృష్ణ మెమోరి యల్ నాగార్జున కళాపరిషత్ కొండపల్లి వారి నిర్వహణలో జరుగుతున్న 15వ ఆహ్వాన నాటిక ప్రదర్శనలు కొండపల్లిలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలను నాగార్జున కళాపరిషత్ అధ్యక్షులు లయన్ దేవినేని కిషోర్‌కుమార్ జ్యోతిప్రజల్వన చేసి ప్రారంభిం చారు. ప్రారంభ కార్యక్రమంలో పరిషత్ కన్వీనర్ యంవి రఘు, ఉపాధ్యక్షులు కొల్లి వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కళ్ళు శ్రీనివాస్, సిహెచ్ దుర్గా కోటేశ్వరరావు పాల్గొన్నారు. మొదటి రోజు ప్రదర్శనలో భాగంగా మల్లాది క్రియేషన్స్ హైదరాబాద్ వారి 'అమెరికా అల్లుడు' నాటిక తరువాత ది అమె చ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ చిలకలూరి పేట వారి 'ఆలితో సరదాగా' నాటికలు ప్రదర్శించారు. అనంతరం నాటిక ప్రదర్శించిన నటులకు బృందాలకు పారితోషకాలను అభినందనలను రమేష్ హస్పటల్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ యంపి దాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అంతరించిపోతున్న నాటక కళలను ఉత్సాహపరిచి వారిని ప్రోత్సహించే ఇట్లాంటి ప్రదర్శనలు మరిన్నీ ముందుకు రావాలని ఆశించారు.

రేపు బెనిఫిట్ మెడికల్ బజార్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్ : ఇటీవల కాలంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పడుతున్న వైద్య చికిత్స, ఔషధాల ఖర్చులను గణనీయంగా తగ్గించేందుకు, ఫార్మా రంగంలో తమకున్న 25 సంవత్సరాల అనుభవాన్ని మేళవించి 23న తాము నూతనంగా ప్రారంభిస్తున్న బెనిఫిట్ మెడికల్ బజార్‌ను వినియోగించుకోవాలని బెనిఫిట్ మెడికల్ బజార్ అధినేత తాతా వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. మహాత్మాగాంధీ రోడ్డులోని టిక్కిల్ రోడ్డులో ఉన్న హెూటల్ మనార్ ఫుడ్‌ప్లాజాలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాతా వెంకట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. సాధారణ మందుల దుకాణాల్లో లభించే ధరల కంటే అత్యంత చౌకయిన ధరలకే నాణ్యమైన మందులను విక్రయించనున్నట్లు చెప్పారు. మందులపై 80శాతం వరకు రాయితీ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 23న ఉదయం



విద్యాధరపురంలోని సితార సెంటర్‌లో నూతనంగా నిర్మించిన భవనంలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ప్రముఖ నటీమణి నవీనా జాక్సన్ తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్లలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి కంచికచర్ల :కంచికచర్ల అంబేద్కర్ కాలనీలో నిర్వహించిన ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో కూడిన కర పత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం పేరుతో ముఖ్యమంత్రి జగన్ ప్రజలకు చిల్లర వేస్తూ, ప్రకతి వనరుల దోచుకుంటున్నాడని ఆరోపించారు. దోపిడీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని ఆమె పిలుపునిచ్చారు. మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, పేరకలపాడు సర్పంచ్ మన్నే సాత్విక, మాజీ ఎంపిపి అల్లడి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియం నందు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో జరిగే షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలను జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు సామినేని వెంకట కష్ణ ప్రసాద్ బాబు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ క్రీడలు ఆడడం ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలను కూడా అలవాటు చేసుకోవాలని, క్రీడల ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంటుందని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, దువ్వల రామకష్ణ, పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పని కాంట్రాక్టును పొడిగించడం హర్షణీయం

• బాబూరావు, రవి

ప్రజాశక్తి-విజయవాడ

రాజధాని పారిశుధ్య కార్మికులకు 2025వ సంవత్సరం మార్చి వరకు శానిటేషన్ పని పొడిగిస్తూ తీర్మానం చేయడంతో పాటు కార్మికులకు వేతన బకాయిలు చెల్లించటం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం. రవి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం వారు విజయవాడ సిఆర్‌డిఏ కార్యాలయంలో కమిషనర్ వివేక్ యాదవ్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపిన వారందరికీ వారు ధన్యవాదాలు తెలిపారు. పారిశుధ్య కార్మికులకు పెండింగ్ ఉన్న పీఎఫ్ ను కూడా జమ చేయించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను వారు కోరారు. ఈఎస్ఐ కార్డులలో ఏర్పడిన సాంకేతిక ఇబ్బందులను తొలగించి కార్మికులందరికీ ఈఎస్ఐ కార్డులు ఇప్పించాలని కోరారు. రాజధాని అమరావతి గ్రామాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు పని భద్రత కోసం, పెండింగ్ ఉన్న వేతన బకాయిల కోసం రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేసిన ఫలితంగా, సి ఆర్ డి ఏ అధికారులు హామీ ఇచ్చిన విధంగా సి ఆర్ డి ఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ కార్మికులకు పని కాలం పొడిగించడంతో పాటు వేతన బకాయిలు చెల్లించారని తెలిపారు.

ఇదీ సంక్రాంతి సంప్రదాయం..!!

'పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల' అంటూ 'కుబుసం' చిత్రంలో వందేమాతరం శ్రీనివాస్ ఆలపించిన పాట అక్షర సత్యమని ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది. సంక్రాంతి వచ్చిందంటే ఈ పరిస్థితి మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఎందుకంటే సంక్రాంతి పండుగ పేరులో సంప్రదాయం ముసుగులో నిర్వహిస్తున్న జూద క్రీడలు సామాన్యులను జుగుప్సకు గురిచేస్తున్నాయి. విశృంఖలంగా నిర్వహిస్తున్న కోడిపెందేలు, గుండాట, పేకాట వంటి జూద క్రీడలతో గ్రామీణ వాతావరణం కలుషితమవుతోంది. కోడి పందేల బరులు పెద్దఎత్తున ఏర్పాటు చేసి కోట్లలో పందేలను యధేచ్ఛగా నిర్వహించారు. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలో రూ.650 కోట్ల వరకు పందేల్లో చేతులు మారినట్లు అంచనా.

కోళ్ళ కత్తులు దూసిన అనేక చోట్ల బౌన్సర్లను పెట్టి మరీ యథేచ్ఛగా పందేలు నిర్వహించారు. జూదరులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మద్యం విక్రయాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. విశేషమేమిటంటే ఈ జూదక్రీడలకు ప్రజాప్రతినిధులు, మంత్రులు వత్తాసులు నిలబడడం. కొందరు ప్రజా ప్రతినిధులు ఏకంగా పోటీలనే నిర్వహించడం చూస్తూ మనం గొప్పగా చెప్పుకునే సంప్రదాయం, సంస్కృతి ఇదా అని ఆశ్చర్యం కలిగించక మానదు. ముఖ్యంగా యువతను మనం ఎటువైపు తీసుకెళుతున్నామో కూడా ఆలోచించే ఇంగితజ్ఞానం మన ప్రజాప్రతినిధులకు లేకుండా పోతోంది. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలతో యాంత్రిక జీవనం, పాశ్చాత్య సంస్కృతితో పల్లెల్లో విస్తరిస్తున్న ఈ చెడు సంస్కృతికి భిన్నంగా అసలైన సంక్రాంతి పండుగ సంస్కృతీ సంప్రదాయాలు ఇవీ అని చాటిచెప్పాయి ప్రజా సంఘాలు. కోడిపందేలు, పేకాట, జూదంవైపు వెళ్లకుండా, యువతలో ఐక్యమత్యానికి ప్రతీకగా వారిలో స్ఫూర్తి నింపేలా పోటీలు జరిపాయి. చిన్నారులు, మహిళలు, యువతీ యువకుల్లో ఉత్సాహం నింపేలా పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి శభాష్ అనిపించుకున్నాయి. పిల్లల్లో మానసిక వికాసానికి, మహిళలు, యువతీ యువకుల్లో సృజనాత్మకతకు ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, పిఎన్ఎం, కెవిపిఎస్, జెవివి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, ఆవాజ్, కౌలు రైతు, రైతు సంఘం వంటి ప్రజా సంఘాలు అనేక రకాలు పోటీలు నిర్వహించి ఇదీ సంప్రదాయం అంటే అని చాటిచెప్పాయి. "సంక్రాంతి ఆటలు యువజన మైత్రికి బాటలు' అనే నినాదంతో ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో క్రికెట్, ముగ్గులు, పరుగు పందెం, సైకిల్ స్లో, మ్యూజికల్ చైర్స్, చెస్, క్యారమ్స్, షటిల్, మోకులాడుట, కబడ్డీ, బకెట్లో బాల్, వ్యాసరచన, షటిల్, బాడ్మింటన్, త్రోబాల్, కుండకొట్టుట, లెమన్ స్పూన్, సైక్లింగ్, స్కిప్పింగ్, ఒప్పులకుప్ప, వంటి ఆటల పోటీలు ఘనంగా నిర్వహించాయి. ఆటా పాటా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి ప్రజల్లో ఉత్తేజాన్ని నింపాయి. రైతుల పండుగైన సంక్రాంతి సందర్భంగా భోగి మంటలు వేయడం, బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం, సాంప్రదాయ వంటకాలు చేయడం, గాలిలో పతంగులు ఎగుర వేయడం వంటి కూడా నిర్వహించాయి. పిల్లల్లో మానసిక వికాసానికి, మెరుగైన సమాజ నిర్మాణానికి కృషి చేశాయి. పల్లెటూరు ఆడపడుచుల వేషధారణ, వాలుజడ పోటీలు జోడి కాంటెస్ట్ వంటివి వినూత్నంగా నిర్వహించాయి. భరతనాట్యం, కూచిపూడి, సినీ పాటలకు అనుగుణంగా బాలబాలికల నృత్యాల ప్రదర్శనలు ఇచ్చాయి. హరిదాసు వేషధారణలు, గంగిరెద్దులు, తెలుగమ్మాయి, తెలుగబ్బాయి పోటీల్లో ప్రజల్లో పోటీతత్వాన్ని గుర్తుచేశాయి.

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని సింగ్‌నగర్ 58వ డివిజన్ కృష్ణాహోటల్ సెంటర్, కనకదుర్గానగర్, షాదీఖానా ఏరియా, భగత్‌సింగ్‌నగర్, శివాలయం, 60వ డివిజన్ వాంబేకాలనీ, 61వ డివిజన్ శాంతినగర్, 63వ డివిజన్ రాజీవ్‌నగర్, 64వ డివిజన్ ప్రజాశక్తి నగర్, కండ్రిక, 32వ డివిజన్ అయోధ్యనగర్, 57వ డివిజన్ ఆర్ఆర్‌పేట, దుర్గాపురం తదితర ప్రాంతాల్లో పలు రకాల పోటీలు జరిగాయి.

వీక్షణం

మగువలో ఎంతో సృజనాత్మక దాగి ఉందని చాటిచెప్పేలా పలు వీధుల్లో ఈ చివరి నుండి ఆ చివరి వరకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించాయి. ఈ పోటీల్లో వందలాది మంది పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవాల్లో ఎంతో మంది భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమలో చిన్నారుల కళారూపాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. అలాగే - విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 40, 41, 42 డివిజన్లతోపాటు భవానీపురం బ్యాంక్ సెంటర్, 44వ డివిజన్ విద్యాధరపురంలో 12 రకాల ఆటల పోటీలు నిర్వహించారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని మొగల్‌రాజపురంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విజయవాడ నగరంలోనే నాద వినోద మ్యూజిక్ అకాడమీ (యుఎస్ఎ), జాషువా సాంస్కృతిక వేదిక, గంగాధర్ ఫైన్ ఆర్ట్ అకాడమీ, సుమధుర కళానికేతన్ ఆధ్వర్యాన సంక్రాంతి సంగీత విభావరి నిర్వహించారు. తిరువూరు సుందరయ్య కాలనీలో సంక్రాంతి సంబరాలు పేరుతో ఆటల పోటీలు ఘనంగా నిర్వహించారు. విజయవాడ రూరల్ మండలం పి.నైనవరంలో ఆటల పోటీలు జరిగాయి. జగ్గయ్యపేటలో మండలం షేర్‌మహ్మద్ పేటలో 10 రోజులపాటు నిర్వహించిన క్రీడలు ఎంతో సుహృద్భావ వాతావారణంలో సాగాయి. 1994, 2011 సారా వ్యతిరేక ఉద్యమాలతో ఎంతో పేరుగాంచిన షేర్ మహ్మద్‌పేటలో నిర్వహించిన ఆటల పోటీలను అందరినీ అలరించాయి. మండల కేంద్రమైన వత్సవాయితోపాటు మండలంలోని పోలంపల్లిలో క్రీడాపోటీలు జరిగాయి. నందిగామ డివిఆర్ కాలనీ 18వ వార్డు, 11వ వార్డులో ముగ్గుల పోటీలతోపాటు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో ముగ్గుల పోటీలు జరిగాయి. ఇక కృష్ణాజిల్లా గుడివాడ పట్టణం మందపాడు, స్లేటర్‌పేట, 16 వార్డు, కొమరగుండంల్లో నిర్వహించిన పోటీలు ఎంతో మందిని ఉత్సాహపరిచాయి. ఉయ్యూరు ఐదో వార్డులో యువతీ యువకులకు పలు రకాల ఆటల పోటీలు జరిగాయి. మచిలీపట్నం రాజుపేట మగ్గాల పేటలో నిర్వహించిన ఆటల పోటీలు, పెనమలూరు మండలం యనమలకుదురులో నిర్వహించిన ఆటాపాట కళా ప్రదర్శనలతోపాటు వివిధ రకాల ఆటల పోటీలు ఆకట్టుకున్నాయి. గన్నవరంలో బాలోత్సవ కమిటీ ఆధ్వర్యాన బాలల్లో ప్రతిభా పాటవాల వెలికితీసే ప్రయత్నం జరిగింది. సిపిఎం ఆధ్వర్యాన గన్నవరం దళితవాడ, అల్లాపురంలో ఆటల పోటీలు జరిగాయి. కోడూరు మండలం విశ్వనాథపల్లి, ఉంగుటూరు మండలం ఎలుకపాడు, - కంకిపాడు మండలం గొడవర్రు, మండల కేంద్రమైన బంటుమిల్లి రజకుల వీధితోపాటు మండలంలోని ములపర్రు, మొవ్వ మండలం చినముత్తేవిలో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఇలా ఉమ్మడి కృష్ణాజిల్లావ్యాప్తంగా ప్రజా సంఘాల వారు సమాజంలో మంచి సంస్కృతీ సంప్రదాయాలను వ్యాపింపజేసేందుకు తమవంతుగా కృషి చేయడం అభినందనీయం.

- ఎం.బి.నాథన్

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.